





సంగంలోని వృద్ధాశ్రమంలో త్రిదండి రామానుజ చిన్న జీయర్

దేవుడిపై భక్తిభావంతో మెలగండి

- త్రిదండి రామానుజ చిన్న జీయర్

6

దేవుడిపై ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలిగినప్పుడే ఆయన మనపై అంతే ప్రేమ చూపిస్తారని త్రిదండి రామానుజ చిన్నజీయర్ అన్నారు. సోమవారం సంగం, కలువాయి మండలాల్లో పర్యటించిన చిన్నజీయర్ భక్తులతో మాట్లాడారు. చిన్న, పెద్ద, ధనిక, పేద, కులాలకు అతీతంగా ప్రజలందరినీ ఒకచోటకు చేర్చేదే ఆలయమని అన్నారు.

'సోమశిల'లో నీటినిల్వ 70 టీఎంసీలు

అనంతసాగరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటిమట్టం 70.277 టీఎంసీలకు చేరుకుంది. ఎగువ ప్రాంతం నుంచి 8,384 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దిగువ డెల్టాకు 50, కండలేరుకు తెలుగుగంగ ద్వారా 3,000, ఉత్తరకాలువకు 550, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



జడ్పీ సీఈవోగా విద్యారమ

నెల్లూరు (జడ్పీ), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సీఈవోగా శ్రీకాళహస్తి డీఎల్‌డీవోగా పనిచేస్తున్న ఎం.విద్యారమను నియమిస్తూ కూటమి ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడున్న ఖాదర్‌బాషా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో సీఈవో పోస్టు ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో జడ్పీ సీఈవోగా విద్యారమను పంచాయతీరాజ్ శాఖ నియమించింది. ఒకటీ రెండు రోజుల్లో ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు.





నెల్లూరు : మూలపేట శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఓం నమో.. శివ రుద్రాయ

కార్తీక మాసం మూడవ సోమవారం సందర్భంగా భక్తజనంతో శైవక్షేత్రాలు శోభిల్లాయి. ఉదయం నుంచే స్వామివార్లకు పాలభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు, విశేష పూజలు జరిగాయి. దీపాలు వెలిగించిన భక్తులు విశేష అలంకరణలో కొలువుదీరిన స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఇక సముద్ర, నదీతీర ప్రాంతాల్లోనూ భక్తులు స్నానమాచరించి, కార్తీక దీపాలు వెలగించారు.

వ్యవసాయ రుణాల పునరుద్ధరణకు బ్యాంకర్లు అమలు చేస్తున్న నిబంధనలు అన్నదాతలను కష్టాల్లోకి నెట్టేస్తున్నాయి. పాత రుణాలను వడ్డీతోసహా చెల్లిస్తేనే కొత్త రుణాలు ఇస్తామని తెగేసి చెబుతున్నారు. దీంతో రైతులు ఏం చేయాలో దిక్కుతోచక తలలు పట్టుకుంటున్నారు. సాధారణంగా సీజన్ ఆరంభంలో పంటల సాగు కోసం కర్షకులకు చేయూతగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడ్డీ రాయితీ అమలు చేస్తున్నాయి. విపత్కర పరిస్థితుల తలెత్తినప్పుడు వడ్డీ కట్టి రుణాన్ని పునరుద్ధరించుకుంటారు. అయితే, మారిన నిబంధనలతో ఈ పరిస్థితి లేకుండా పోయింది. బ్యాంకర్లు కూడా పూర్తి రుణం చెల్లిస్తేనే కొత్త రుణాలు ఇస్తామని చెబుతుండటంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

\- ఆత్మకూరు (ఆంధ్రజ్యోతి)

అసలు, వడ్డీ చెల్లిస్తేనే
కొత్త రుణం!

పంట రుణాల మంజూరుకు బ్యాంకర్ల మెలిక

రాయితీ కోల్పోతున్న అన్నదాతలు

నెరవేరని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం



అసలు, వడ్డీ చెల్లించమన్నారు

నాకు కొరిమెర్లలో రెండున్నర ఎకరాల పొలం ఉంది. సంగం కెనరా బ్యాంకులో గత ఏడాది ఒక లక్ష రూపాయలు పంట రుణం తీసుకున్నాను. ఏడాది పూర్తి కావస్తుండటంతో పంట రుణం రెన్యూవల్ చేయడానికి వెళ్లాను. అసలు, వడ్డీ మొత్తం చెల్లిస్తేనే కొత్త క్రాప్‌లోన్ ఇస్తామన్నారు.

\- అక్కలనేని దొరబాబు, రైతు, కొరిమెర్ల



సంవత్సరంలోపు కడుతున్నా రాయితీ అందలేదు!

తరుణవాయిలో నాకు రెండు ఎకరాల పొలం ఉంది. సంగం కెనరా బ్యాంకులో రూ.90 వేలు పంట రుణం తీసుకున్నా. మళ్లీ ఏడాదిలోపు వడ్డీతో కలిపి అసలు మొత్తం చెల్లించి కొత్తగా పంట రుణం తీసుకుంటున్నా. అలాగైతేనే ప్రభుత్వం ఇచ్చే వడ్డీ రాయితీ వస్తుందని అంటున్నారు. చేసేదిలేక ప్రతి సంవత్సరం మొత్తం చెల్లిస్తున్నా. కానీ ఒక్కసారి కూడా వడ్డీ రాయితీ వచ్చిన దాఖలాలు లేవు.

\- దేగా కృష్ణయ్య, రైతు, తరుణవాయి



జిల్లాలో 65 శాతం ప్రజలు గ్రామాల్లో నివసిస్తూ వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత రంగాలపై ఆధారపడి ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి, రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగా రైతులకు తక్కువ వడ్డీకి వ్యవసాయ రుణాలు అందించడమే ప్రభుత్వం లక్ష్యం. పంటల సాగుకు రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడ్డీ రాయతీని అమలు చేస్తున్నాయి. ఏడాదిలోపు తిరిగి చెల్లిస్తే మూడు శాతం వడ్డీ రాయతీని కేంద్రం సదరు రైతు ఖాతాలో తిరిగి జమ చేస్తుంది. రూ. లక్షలోపు రుణం తీసుకున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సున్నా వడ్డీ కింద విగిలిన నాలుగు శాతాన్ని చెల్లిస్తోంది. అయితే వ్యవసాయ రుణాల రెన్యూవల్‌లో కొందరు బ్యాంకర్లు నిబంధనల పేరిట మోకాలడ్డుతున్నారు. అసలు, వడ్డీని పూర్తిగా చెల్లిస్తేనే రుణాలు రెన్యూవల్ చేస్తామని చెబుతున్నారు. చిన్న, సన్నకారు రైతులు పంట దిగుబడి చేతికి వచ్చిన తరువాత వడ్డీతో సహా చెల్లిస్తారు. కానీ పంట దిగుబడి సరిగా లేకపోవడం, గిట్టుబాటు ధర రాకపోవడం తదితర కొన్ని అనివార్య పరిస్థితులు ఎదురైనప్పుడు వడ్డీ చెల్లించి రుణాలను రెన్యూవల్ చేయించుకుంటారు. కానీ కొందరు బ్యాంకర్లు నిబంధనలు మేరకు పూర్తి మొత్తం చెల్లిస్తేనే కొత్త రుణం మంజూరు ఇస్తామని చెబుతున్నారు. దీంతో సకాలంలో రుణాల మొత్తం చెల్లించలేక కొందరు రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని కోల్పోవలసి వస్తోంది.

రుణాలు చెల్లించిన రైతులకు వడ్డీ రాయితీ లభిస్తోంది. చిన్న, సన్నకారు రైతులు పంట దిగుబడి చేతికి వచ్చిన తరువాత వడ్డీతో సహా చెల్లిస్తారు. కానీ దిగుబడి సరిగా లేకపోవడం, గిట్టుబాటు ధర రాకపోవడం తదితర అనివార్య పరిస్థితులు ఎదురైనప్పుడు వడ్డీ చెల్లించి రుణాలను రెన్యూవల్ చేయించుకుంటారు. కొందరు బ్యాంకర్లు మాత్రమే వడ్డీ కట్టించుకుని పంట రుణాన్ని రెన్యూవల్ చేస్తున్నారు. ఇంకొందరు బ్యాంకర్లు నిబంధనల మేరకు పూర్తి మొత్తం చెల్లిస్తేనే కొత్త రుణం మంజూరు చేస్తామని తెగేసి చెబుతున్నారు. దీంతో సకాలంలో రుణాల మొత్తం చెల్లించలేక కొందరు రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని కోల్పోవలసి వస్తోంది.



● పంట రుణ లక్ష్యం రూ.8929 కోట్లు

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 4.43 లక్షల మంది రైతులకు రూ.8929.02 కోట్ల పంట రుణాలు అందించాలనే లక్ష్యంగా బ్యాంకర్లకు నిర్దేశించారు. అయితే, సెప్టెంబరు నెల వరకు 2.83 లక్షల మంది రైతులకు రూ.5,666 కోట్లు మంజూరు చేశారు. ఈ క్రమంలో 63.46 శాతం రుణాల మంజూరు మాత్రమే పూర్తయింది. సకాలంలో పూర్తి మొత్తం చెల్లించనందున 20 శాతం పైబడి రైతులు వడ్డీ రాయితీని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది.

● పంట రుణాలకు మోకాలడ్డు

జిల్లాలో ఎక్కువ మంది రైతులు ఎస్‌బీఐ, యూనియన్, కెనరా, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకుంటారు. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న సాగు విస్తీర్ణం ఆధారంగా ఒక్కో పంటకు ఒక్కో రకంగా (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) రుణాలు మంజూరు చేస్తున్నారు. విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో రైతుకు గరిష్ఠంగా 7 శాతం వార్షిక వడ్డీతో రూ.3 లక్షల వరకు రుణం ఇస్తున్నారు. సకాలంలో

కలుషిత ఆహారం తిని 35 మంది విద్యార్థులకు అస్వస్థత



హాస్టల్‌లోనే చికిత్స పొందుతున్న విద్యార్థులు

- ఏకలవ్య పాఠశాలలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి
- హుటాహుటిగా చేరుకున్న అధికారులు, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి
- ప్రిన్సిపాల్, సిబ్బంది తీరుపై ఆగ్రహం

- వివరాలు 6లో..


సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

నెల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల ఎన్నికలను తాత్కాలికంగా వాయిదా వేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించడం కష్టమని భావించిన ప్రభుత్వం ఆ మేరకు వాయిదా వేసింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 29వ తేదీ నాటికి ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటికే ఎన్నికల అధికారుల నియామకం, వారికి శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఓటర్ల జాబితా కూడా దాదాపుగా పూర్తయింది. ఈ నెల 20వ తేదీన పోలింగ్ నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. రెండు వారాల్లో పూర్తి కావాల్సిన ఎన్నికల ప్రక్రియ వాయిదా పడింది. ఈ ప్రక్రియను తదుపరి ఎప్పుడు మొదలుపెట్టాలన్నది ప్రభుత్వం త్వరలోనే ప్రకటించనుంది.

ఆధునిక సాంకేతికతతో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ

- అతిత్వరలో నెల్లూరులో ఏర్పాటు
- తొలిగా మూడు చోట్ల, ఆ తర్వాత మిగిలిన ప్రాంతాల్లో...
- కార్పొరేషన్ కమిషనర్, ఎస్పీ వెల్లడి

6



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ, పక్కన ఎస్పీ కృష్ణకాంత్



తిక్కన భవన్‌లో ఖాళీగా ఉన్న అధికారుల కుర్చీలు

మేమొచ్చినా.. మీరు రారేం!?

- అధికారుల తీరుపై జేసీ కార్తీక్ ఆగ్రహం
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కుర్చీలన్నీ ఖాళీ
- షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశం

'ఈరోజు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉందని తెలియదా!?. ఉన్నతాధికారులమైన మేమే పదిగంటలకల్లా వచ్చేశాం. మీరు రావడానికి ఇబ్బందేముంది. రానీ అధికారులందరికీ షోకాజ్ నోటీసులు ఇవ్వండి.' అంటూ జాయింట్ కలెక్టర్ కార్తీక్ డీఆర్వోను ఆదేశించారు. అయితే, నిమిషాల వ్యవధిలో అక్కడకు చేరుకున్న అధికారులు గుమికూడి రిజిస్టర్‌లో సంతకాలు చేస్తుండగా, మరోమారు జేసీ ఆగ్రహించి షోకాజు నోటీసులు జారీ చేయాలని గట్టిగా ఆదేశించారు.

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సమయపాలన పాటిస్తూ, కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రావాల్సిన వివిధ శాఖల అధికారులు సోమవారం డుమ్మా కొట్టారు. ఉదయం 10 గంటలకే తిక్కన భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభమవగా, జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్ పాల్గొన్నారు. అయితే, వీరికి ఎదురుగా వివిధ శాఖల అధికారులకు వేసిన కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి. 10.30 గంటలైనా అధికారులు రాలేదు. ఒక అర్జీదారు ఫిర్యాదు మేరకు సంబంధిత అధికారిని జేసీ పిలిచారు. కానీ ఆ శాఖ నుంచి ఎవరూ పలకలేదు. దీంతో తన ఎదురుగా ఉన్న అధికారుల కుర్చీల వైపు జేసీ చూశారు. దాదాపు అన్నీ ఖాళీగా కనిపించాయి.

● జేసీ ఆదేశాలతో పరుగులు

ఉన్నతాధికారులు, అర్జీదారులు వచ్చినా పలు శాఖల అధికారులు హాజరు కాకపోవడంపై జేసీలో ఆగ్రహం తెప్పించింది. వెంటనే సదరు అధికారులందరికీ షోకాజు నోటీసులు జారీ చేయాలని డీఆర్వో ఉదయ భాస్కర్‌ను ఆదేశించారు. విషయం తెలుసుకున్న వెనువెంటనే

- మిగతా 6లో..

దేవుడిపై భక్తిభావంతో మెలగాలి

● త్రిదండి రామానుజ చిన్నజీయర్‌స్వామి

సంగం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దేవుడిపై భక్తిభావంతో మెలిగితే దేవుడు కూడా మనపై అంతే ప్రేమ చూపిస్తారని త్రిదండి రామానుజ చిన్నజీయర్ స్వామి పేర్కొన్నారు. సోమవారం ఆయన మండలంలోని అమరపునాయుడు కండ్రికలో ల్యాంకో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈసందర్భంగా స్వామీజీకి వృద్ధాశ్రమ నిర్వాహకురాలు లగడపాటి రామలక్ష్మమ్మ స్వాగతం పలికారు. వృద్ధాశ్రమం ఏర్పాటు లక్ష్యం, చేపట్టే సేవా కార్యక్రమాలను స్వామీజీకి వివరించారు. అనంతరం ఆశ్రమం ప్రవేశం వద్ద ఉన్న అభయాంజనేయస్వామి, కృష్ణాలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ కార్తీకమాసంలో ఇంట్లో, దేవాలయంలో దీపాలు వెలిగిస్తే మేలు జరుగుతుందన్నారు. ప్రజలందరూ ఆలయానికి వెళ్లి దీపాలు వెలిగించాలని, వన భోజనాలు చేయాలన్నారు. చిన్న, పెద్ద, ధనిక, పేద, కులాలకు అతీతంగా ప్రజలందరినీ ఒకచోటకు చేర్చేదే ఆలయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాణా శ్రీనివాసులురెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



పరమానంద ఆశ్రమంలో....

కలువాయి : మండలం రాజుపాళెం సమీపంలోని పరమానంద ఆశ్రమంలో జరుగు పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చిన్నజీయర్‌స్వామి సోమవారం రాత్రి ఆశ్రమానికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం గోపూజ, కార్తీక వనభోజనాలు, సాయంత్రం పెన్నానది హారతి కార్యక్రమంలో పాల్గొంటారని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. అలాగే 20వ తేదీన ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన వసతిగృహాలను చిన్నజీయర్‌స్వామి ప్రారంభిస్తారని వివరించారు.

ఆధునిక సాంకేతికతతో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ

● అతిత్వరలో నెల్లూరులో ఏర్పాటు : కమిషనర్, ఎస్పీ

నెల్లూరు(సిటీ), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా రూపొందించబడిన అధునాత సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన ఇంటెలిజెంట్ ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను నెల్లూరులో అతి త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ, ఎస్పీ కృష్ణకాంత్ వెల్లడించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ట్రాఫిక్ పోలీసులు, ఇంజనీరింగ్ అధికారులు మాట్రిక్స్ ఎస్‌పీటీ నెట్‌వర్క్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిగ్నలింగ్ వ్యవస్థలో పాత పద్ధతులకు స్వస్తి చెబుతూ నూతన టెక్నాలజీని అందుపుచ్చుకుని సాంకేతిక వ్యవస్థను పూర్తిగా వాడనున్నట్లు తెలిపారు. తొలిగా నగరంలోని ఏసీకూరగాయల మార్కెట్, కేవీఆర్ కూడలి, కనకమహల్ సెంటర్ వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మలి విడుతలో జిల్లా పోలీసు కార్యాలయం, హరనాథపురం, రామలింగాపురం, వీఆర్సీ కూడళ్ల వద్ద ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ఇందుకోసం రూ.1.39 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నూతన విధానంలో పొల్యూషన్ మానటరింగ్, గ్రీన్‌చానల్, సెంట్రలైజడ్ సిస్టమ్, కేబుల్ ఫ్రీ, సెల్ఫ్ అడాప్టింగ్ కంట్రోల్, మల్టీ పిరియడ్ కంట్రోల్ వంటి అడ్వాన్స్ ప్రయోజనాలెన్నో ఉంటాయని తెలిపారు.

డీఆర్‌డీఏ ఏపీఎం సస్పెన్షన్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : డీఆర్‌డీఏ జాబ్స్ విభాగంలో ఏపీఎంగా పనిచేస్తున్న శేషారెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయగిరి ఏరియా కోఆర్డినేటర్ (ఇన్‌చార్జి)గా శేషారెడ్డి గతంలో పని చేస్తున్న సందర్భంలో సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికలలో వైసీపీ తరఫున శేషారెడ్డి ప్రచారం చేశారని పలువురు కలెక్టర్, ఎన్నికల సంఘం దృష్టికి తీసుకుని వచ్చారు. దీనిపై అప్పటి జడ్పీ సీఈఓ కన్నమ నాయుడును విచారణాధికారిగా నియోమించారు. విచారణలో వాస్తవమని తేలింది. అయితే, ఈ నివేదిక అంది చాలా కాలమైనా ఫైల్‌ను తొక్కిపెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ఎప్పుడో ఐదు నెలల క్రితం జరిగిన ఘటనపై ఇంకా చర్యలు తీసుకోలేదనే విషయమై ఫిర్యాదుదారులు ప్రశ్నించడంతో కలెక్టర్ ఈ మేరకు చర్యలు తీసుకున్నారు.

తప్పించుకోవడం ఎలా?



ప్రకృతి వైపరీత్యాల్లో ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

ప్రకృతి వైపరీత్యాల నుంచి సురక్షితంగా బయట పడడం ఎలా? అనే అంశంపై ఎన్డీఆర్ఎఫ్ బృందం అధికారులు కలెక్టరేట్ తిక్కన భవన్‌లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరదలు, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎలా కాపాడుకోవాలనే అంశాలపై ప్రదర్శన నిర్వహించారు. గుండె నొప్పి వచ్చినప్పుడు సీపీఆర్ చికిత్స ఎలా చేయాలనేదానిపై డెమో ద్వారా వివరించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించిన జేసీ కార్తీక్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వైపరీత్యాల స్పందనశాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వీరశేఖర్, డీపీవో శ్రీధర్‌రెడ్డి, డీఆర్వో ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)



నెల్లూరు : ఉమామహేశ్వర ఆలయంలో ఆకట్టుకున్న పూలాలంకరణలు



నెల్లూరు : మూలస్థానేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఆరనీకుమా ఈ దీపం..

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం



కార్తీక మాసం మూడవ సోమవారం వేడుకలు జిల్లాలో వైభవంగా జరిగాయి. రామాయపట్నం, తుమ్మలపెంట, ఇస్కపల్లి, రామతీర్థం, మైపాడు, కోడూరుపాడు, కాటేపల్లి, తదితర తీర ప్రాంతాల్లో సూర్యోదయానికి ముందే భక్తులు సముద్ర స్నానాలకు విచ్చేశారు. దీంతో ఆయా ప్రాంతాలు శివనామస్మరణలతో మారుమోగాయి. అలాగే శైవక్షేత్రాలల్లోనూ తెల్లవారు జాము నుంచే స్వామివార్లకు పాలభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. రుద్రహోమాలు, విశేష పూజలు, పుష్పాలంకారాలతో మూలవర్లు కళకళలాడాయి. సాయంత్రం ఆలయాలకు తరలివచ్చిన భక్తులు దీపాలు వెలిగించి, శివారాధన చేశారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



సీతారామపురం : భైరవకోనలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పొదలకూరులో పార్వతీపరమేశ్వరుల కల్యాణం



సైదాపురం : సిద్ధులకోనలో సిద్ధులకు పూజలు చేస్తున్న దేవరులు

వేదగిరిలో హుండీల లెక్కింపు

నెల్లూరు రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వేదగిరి క్షేత్రానికి గడిచిన 65 రో జుల్లో భక్తులు సమర్పించిన కానులక ద్వారా రూ.5.99 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఈవో గోపి తెలిపారు. ఆలయంలో ప్రధాన హుండీతో పాటు కొండికానులు, అన్నదానం హుండీలను సోమవారం లెక్కించారు. అన్నీ హుండీలలో కలిపి పైమొత్తం ఆదాయం సమకూరిందని, ఈ మొత్తాన్ని బ్యాంకులో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు.

మీరు రారేం!?

(5వ పేజీ తరువాయి)

10.45 సమయంలో కొందరు అధికారులు, అటెండెన్సు చూసే గుమాస్తా వద్దకు వెళ్లి లాలూచీ పడి సంతకాలు చేయడం మొదలు పెట్టారు. ఏమాత్రం భయం లేకుండా జేసీ, డీఆర్వోల పక్కనే గుమికూడి అటెండెన్సు రిజిస్టర్‌లో సంతకాలు చేశారు. దీనిని గమనించిన జేసీ రిజిస్టర్‌లో సంతకాలు చేయడం ఆపించి, షోకాజు నోటీసులు జారీ చేయాలని గట్టిగా ఆదేశించారు. అప్పటికీ తిక్కన భవన్‌కు హాజరుకాని 15 మంది అధికారులకు షోకాజు నోటీసులను జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నిర్ధేశించిన సమయం కన్నా ముందే రావాల్సిన అధికారులు ప్రతి సోమవారం ఆలస్యంగానే వస్తున్నారు. ఇప్పటివరకు ఎవరూ వీరిని గమనించలేదు. సోమవారం అధికారుల సీట్లన్నీ ఖాళీగా కనిపించటంతో అధికారుల డుమ్మా విషయం బయట పడింది. ఉన్నతాధికారులు వచ్చినా, సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు సకాలంలో రాకపోవడాన్ని చూస్తే తమ పట్ల అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతుందని అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

నెల్లూరు జైలుకు మేకా వెంకటరామిరెడ్డి

నెల్లూరు(క్రైం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సోషల్ మీడియాలో ప్రతిపక్ష నాయకులు, వారి కుటుంబ సభ్యులపై విపరీతంగా రెచ్చిపోతూ సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా పోస్టులు పెట్టిన గుంటూరు జిల్లా తాడేపల్లి ప్రాంతానికి చెందిన మేకల వెంకటరామిరెడ్డిని నెల్లూరు దర్గామిట్ట పోలీసులు పీటీ వారెంట్ కింద సోమవారం అరెస్టు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై మేకా వెంకట రామిరెడ్డి సోషల్ మీడియాలో అసభ్యకరంగా మాట్లాడుతున్నారని నెల్లూరు దర్గామిట్ట పోలీసుస్టేషన్‌లో జనసేన పార్టీకి చెందిన నాయకులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే అప్పటికే ఆయన గుంటూరులో నమోదైన ఓ కేసుకు సంబంధించి కావలి సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న పీటీ వారెంట్ కింద కావలి సబ్ జైలు నుంచి అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించడంతో నెల్లూరు జైలుకు తరలించారు.

కలుషిత ఆహారం తిని

35 మంది విద్యార్థులకు అస్వస్థత

● చంద్రశేఖరపురం ఏకలవ్య గురుకులంలో ఘటన ● ఆలస్యంగా వెలుగులోకి..

కొడవలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కలుషిత ఆహారం తిని సుమారు 35 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటన కొడవలూరు మండలం చంద్రశేఖరపురంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో ఆదివారం రాత్రి జరగ్గా, సోమవారం రాత్రి ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ పాఠశాలలో ఆదివారం రాత్రి విద్యార్థులకు ఎప్పటిలాగానే మెనూ ప్రకారం భోజనం వడ్డించారు. భోజనం చేశాక కొద్ది సేపటికి సుమారు 35 మంది విద్యార్థులకు వాంతులు, విరోచనాలు అయ్యాయి. వెంటనే పాఠశాల సిబ్బంది ఏవో కొన్ని మాత్రలు ఇచ్చి మింగించారు. సోమవారం ఉదయం ఈ విషయమై పాఠశాల సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయకుండా తగ్గిపోతుందనే నిర్లక్ష్యంతో ఉండిపోయారు. అయితే సోమవారం రాత్రికల్లా విద్యార్థుల ఆరోగ్యం మరింత ఆరోగ్యం క్షీణించింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే పాఠశాలకు చేరుకోవడంతో సమాచారం బయటకు పొక్కింది. సమాచారం అందుకున్న కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి జిల్లా వైద్యాధికారులకు అప్రమత్తం చేసి వైద్య బృందాన్ని హుటాహుటిన పాఠశాలకు పంపారు. అక్కడికి చేరుకున్న వైద్యులు విద్యార్థులకు సెలైన్‌లు పెట్టి, రక్త పరీక్షలు చేసి చికిత్స అందిస్తున్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య పర్యవేక్షణలో ఆరుగురు వైద్యబృందం విద్యార్థులకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కూడా రాత్రి 9 సమయంలో పాఠశాలకు చేరుకుని విద్యార్థులను పరామర్శించారు. వారిని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. విద్యార్థులు అస్వస్థతకు గురికావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఏకలవ్య పాఠశాల సిబ్బంది, ప్రిన్సిపాల్‌పై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే చర్యలు చేపడతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆమె వెంట డీఎంహెచ్‌వో డాక్టరు పెంచలయ్య, పలువురు టీడీపీ నాయకులు, తదితరులు ఉన్నారు. సోమవారం అర్ధరాత్రి వరకు కూడా చికిత్సలు కొనసాగుతున్నాయి. అవసరమైతే విద్యార్థులను నెల్లూరుకి తరలించి, మెరుగైన చికిత్స అందిస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. వైద్యసేవలను తాను పర్యవేక్షిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.



పాఠశాలలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

చదువుకున్న బడికి చేయూత

● ఎన్నారై కిశోర్‌బాబు దాతృత్వం

● డిజిటల్ తరగతులకు ప్రొజెక్టర్, కంప్యూటర్ వితరణ

● రూ.2లక్షలతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు



సంగం, (ఆంధ్రజ్యోతి) : ఉన్నత చదువులు చదివి ఉద్యోగ రీత్యా దుబాయ్ వెళ్లి వ్యాపారవేత్తగా, ఆర్థికంగా స్థిరపడేందుకు బీజం వేసిన ప్రభుత్వ బడిని ఆయన మరువలేదు. తనకు ఓనమాలు నేర్పించిన సరస్వతీనిలయానికి ఏదో ఒకటి చేయాలని తలిచారు. అంతే గ్రామస్థుల సహాయంతో బడి అభివృద్ధికి చేయూత అందిస్తున్నారు సంగం మండలం దువ్వూరులోని కిశోర్‌బాబు. దువ్వూరుకు చెందిన మోహన్‌రావు, లీలావతమ్మల కుమారుడు కిశోర్‌బాబు పదవ తరగతి వరకు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివారు. మోహన్‌రావుది మధ్య తరగతి కుటుంబం కావడంతో చదువు ప్రాముఖ్యతను గుర్తించి కిశోర్ కష్టపడి చదివారు. కష్టపడి ఇంజనీరింగ్ పూర్తి చేసి చిన్నతనంలోనే ఉద్యోగరీత్యా దుబాయి వెళ్లారు. తన ప్రతిభతో సొంతంగా వ్యాపారం ప్రారంభించి అనతికాలంలోనే పెద్ద వ్యాపారవేత్తగా ఎదిగారు. తల్లిదండ్రులు నెల్లూరులో ఉండటంతో కిషోర్‌బాబు వీరి వద్దకు వచ్చినప్పుడల్లా స్వగ్రామం దువ్వూరుకు వచ్చేవారు. ఈ నేపథ్యంలో తన అభివృద్ధికి కారణమైన ఉన్నత పాఠశాల రుణం తీర్చుకోవాలని భావించారు. దీంతో ఓ ప్రణాళిక ప్రకారం అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

● విద్యార్థుల తాగునీటి అవసరాల కోసం రూ.2 లక్షలతో మినీ మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశారు.

● రూ.1.5 లక్షలతో డిజిటల్ తరగతుల బోధనకు కంప్యూటర్, ప్రొజెక్టర్‌ను అందజేశారు. అలాగే మైక్‌సెట్‌నూ సమకూర్చారు.

● విద్యార్థుల కోసం క్రీడా పరికరాలు పంపిణీ చేశారు.

● ఏటా టెన్త్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్నారు. ఇంకా అభివృద్ధికి నిధులు అందజేస్తానని కిశోర్‌బాబు గ్రామస్థులతో అంటుంటారు.



దువ్వూరు ఉన్నత పాఠశాలలో కిశోర్‌బాబు ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్

పాఠశాలల పనివేళల

మార్పుతో ఇబ్బందులు : ఫ్యాప్టో



డీఈవోకు వినతిపత్రం అందచేస్తున్న ఫ్యాప్టో నాయకులు

నెల్లూరు(విద్య), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనివేళల్లో మార్పులతో ఇబ్బందులు ఎదురవుతాయని, దీన్ని ఉప సంహరించుకోవాలని ఫ్యాప్టో నేతలు సోమవారం డీఈవో ఆర్.బాలాజీరావును కోరారు. ఈ మేరకు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం ఫ్యాప్టో నేతలు ఆయనకు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా పాఠశాలల పని దినాలను ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మార్పు చేశారన్నారు. అయితే గతంలో కొనసాగుతున్న 9 నుంచి 4 గంటల వరకు అందరికీ సౌకర్యవంతంగా ఉందని, విద్యార్థుల మానసిక స్థితికి కూడా ఇది సరిపోతుందన్నారు. విద్యా సంవత్సరం మధ్యలో సమయాలు మారుస్తూ నిర్ణయాలు తీసుకోవడం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసే ప్రమాదముందన్నారు. పని గంటల మార్పుల వలన సుదూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడతారన్నారు. దీనిపై అధికారులు పునరాలోచించి పాత సమయాన్నే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ సురేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాస ప్రసాద్, నేతలు హజరత్, చలపతి, దశరథరాములు, పిచ్చిబాబు, చలపతిశర్మ తదితరులు పాల్గొన్నారు.

డీకేడబ్ల్యూ కళాశాలలో స్కిల్ హబ్

● కస్టమర్ కేర్, డొమెస్టిక్ నాన్ వాయిస్ కోర్సులు

నెల్లూరు(విద్య), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు శిక్షణ అందించేందుకు నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్‌ను ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హబ్‌లో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్-డొమెస్టిక్ నాన్ వాయిస్ కోర్సులు నిర్వహిస్తున్నామని, ఇందుకు 18-30 ఏళ్ల లోపు యువతులు ఇంటర్, ఆపైన చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 30 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, ఈనెల 20వ తేదీ నుంచి నూతన బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభం అవుతుందని, యువతులు, మహిళలకు ఉచితంగా అందించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం సర్టిఫికెట్ అందించడంతోపాటు వందశాతం ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ 8639867407, 9949063284ను సంప్రదించాలని తెలిపారు.

● ఉద్యోగ మేళా

డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ఉద్యోగమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించి 41 మంది వివిధ రకాల ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ ఇన్‌చార్జి డాక్టర్ శ్రీరంజని, సిబ్బంది ఉమా సుమాలిని, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నెల్లూరు(విద్య), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పదో తరగతి 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పరీక్ష ఫీజు గడువు పొడిగించినట్లు డీఈవో ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఈనెల 26వ తేదీ లోగా ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. రూ.50 అపరాధ రుసుముతో 27 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుముతో డిసెంబరు 3 నుంచి 9వతేదీ వరకు, రూ.500 అపరాధ రుసుముతో డిసెంబరు 10 నుంచి 16వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు చెల్లించే పరీక్ష ఫీజులను జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈనెల 26 నుంచి బీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో పాఠశాల లాగిన్ ద్వారా మాత్రమే ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. పరీక్ష ఫీజుతో పాటు ఒకేషనల్, మైగ్రేషన్ సర్టిఫికెట్ కోసం కూడా ఆన్‌లైన్‌లోనే ఫీజు చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌లో లేదా నెల్లూరు నగరంలోని దర్గామిట్ట ప్రభుత్వ పరీక్షల విభాగంలో సంప్రదించాలని తెలిపారు.



రోడ్డు ఎప్పుడేస్తారు?

మండలంలోని మహిమలూరు పంచాయతీ పరిధిలోని కోటపాడు రోడ్డు ఇటీవల కురుస్తున్న వర్షాలకు బురదమయమై రొచ్చు రొచ్చుగా మారి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో సోమవారం గ్రామస్థులతో కలిసి విద్యార్థులు బురదలో దిగి నిరసన వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా కోటపాడు రోడ్డు అధ్వానంగా ఉన్నా పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జిల్లా కలెక్టరు ఆనంద్ మహిమలూరుకు వచ్చినప్పుడు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- ఆత్మకూరు (ఆంధ్రజ్యోతి)



ప్రయాణికుడా.. జర భద్రం..!

మీరు నెల్లూరు-జొన్నవాడ రోడ్డుపై ప్రయాణిస్తున్నారా..? అయితే జర భద్రం. పొట్టేపాళెం సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద నెల్లూరుకు వచ్చే వైపు ఇదిగో.. ఈ ఫొటోలో కనిపిస్తున్నట్లు గుంత ఏర్పడింది. ఆ గుంతలో పడి ఇప్పటికే చాలా మంది ద్విచక్ర వాహనదారులు గాయపడ్డారు. దీంతో ఓ వ్యక్తి డివైడర్‌కున్న సూచిక బోర్డును ఆ గుంత మీద పెట్టాడు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ రాత్రుళ్లు వెళ్లే ప్రయాణికులు ఈ సూచిక బోర్డును చూసి డివైడర్ అనుకుని పక్కకు వెళ్లారో కాలువలో పడతారు. కాస్త నిదానంగా వెళ్తే గమ్యం చేరుతారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఈ గుంతను పూడిస్తే సమస్యే ఉండదు.

- నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)



భళా బాలిక

గుంటూరు జిల్లా ఉప్పలపాడులో ఇటీవల జరిగిన జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో సంగంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. కబడ్డీ, చెస్‌లో మొదటి స్థానం, వాలీబాల్, షాట్‌పుట్‌లో రెండవ స్థానం సాధించారు. 400, 800, 1500 మీటర్ల పరుగు పందెంలో 2, 3 స్థానాలు సాధించారు. 400 రిలేలో రెండవ స్థానం పొంది మొత్తం తొమ్మిది విభాగాల్లో 11 మెడల్స్ సాధించి జోనల్ స్థాయిలో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ సుమతి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, అందుకు కృషి చేసిన పీడీ, పీఈటీలను ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)

నేర వార్తలు (crime news) ఆంధ్రజ్యోతి

మడుగులో గుర్తుతెలియని మృతదేహం



మనుబోలు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కండలేరు వాగులోంచి స్థానిక నేరేడు మాను గుంట డొంక మార్గంలో ఉన్న మడుగులో వచ్చే నీటిలో ఓ వ్యక్తి మృతదేహం(40) సోమవారం కనిపించింది. తెల్లవారుజామున పొలాలవద్దకు వెళ్లిన రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మడుగు దగ్గరకు వెళ్లేందుకు సరైన మార్గం లేదు. దీంతో ఎస్‌ఐ శివ రాకేష్ పొలాల గట్లపై నడుచుకుంటూ వెళ్లి నీటిలో ఉన్న మృతదేహాన్ని సిబ్బందితో కలిసి బయటకు తీశారు. మృతదేహం పాలిపోయిఉండడంతో రెండురోజులుగా నీటిలో ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు ఖాకీ రంగు చొక్కా, నలుపు రంగు డ్రాయిర్ ధరించి ఉన్నాడు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎలాంటి వివరాలు తెలియకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మందుల దుకాణంలో చోరీ

● వరుస ఘటనలతో ఆదురుపల్లి వాసుల బెంబేలు

చేజర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదురుపల్లి గ్రామంలో వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఆదురుపల్లి గ్రామంలో కూడలి పక్కనే ఉన్న మెడికల్ షాపులో ఆదివారం అర్ధరాత్రి షాపుపైన ఉన్న రేకులు తొలగించి దొంగతనానికి యత్నించారు. సోమవారం ఉదయం యజమాని మెడికల్ షాపు తెరవగా పైకప్పు తొలగించి ఉండడం చూసి నిర్ఘాంతపోయాడు. కాగా, ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. గత పదిహేను రోజుల క్రితం ఓ దుకాణంలో ఇలాగే పైకప్పు తొలగించి దాదాపు రూ. 80 వేలకు పైగా చోరీ చేసినట్లు బాధితులు వాపోయారు. అయితే ఆ సంఘటపై కూడా బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ఎవ్వరూ ఫిర్యాదు చేయకపోవడంతో పోలీసులు కూడా ఏమీ చేయలేకపోతున్నారు. ఈ దొంగతనాలన్నీ పైకప్పు తొలగించి చేస్తుండడంతో ఒక్కరే చేస్తున్నట్లు స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

రామాలయంలో..

కలిగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెదకొండూరు పంచాయతీ అయ్యపరెడ్డిపాలెంలో ఆదివారం అర్ధరాత్రి దుండగులు రామాలయ తాళాలు పగులకొట్టి అమ్మవారి మెడలోని 6గ్రాముల మంగళసూత్రంతో పాటు హుండీని తీసుకెళ్లినట్లు సోమవారం గ్రామస్థులు తెలిపారు. అనంతరం గుడికి సమీపంలో హుండీని పగులకొట్టి అందులోని రూ.2వేలకు పైగా నగదును చోరీ చేశారన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఉమాశంకర్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి దర్యాప్తు చేశారు.

హమ్మయ్య... దొంగ దొరికాడు!

● రూ.3.73 లక్షల సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ వేణు

నెల్లూరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాలుగు పోలీసు స్టేషన్లలో 6 కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్న దొంగ ఎట్టకేలకు దొరికాడు. అతని నుంచి రూ.3.73 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నెల్లూరురూరల్ పోలీసు స్టేషన్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో సీఐ జీ.వేణు వివరాలు వెల్లడించారు. నెల్లూరు నగరంలోని వనంతోపు ప్రాంతానికి చెందిన రావు సూర్యానారాయణ నెల్లూరురూరల్ పరిధిలోని యలమవారిదిన్నె, నారాయణ హాస్పిటల్, గుడిపల్లిపాడు, నగరంలోని అరవింద్‌నగర్ ప్రాంతాల్లో మోటారు సైకిళ్లు, గ్యాస్ సిలిండర్ అపహరించాడు. అలాగే కావలి జనతాపేటలో తాళం వేసిన ఇంట్లో ప్రవేశించి 2 ల్యాప్‌ట్యాప్‌లు, తిరుపతి జిల్లా సూళ్లూరుపేట బ్రాహ్మణ వీధిలో తాళం వేసిన మరో ఇంట్లో ల్యాప్‌ట్యాప్ చోరీకి పాల్పడ్డాడు. ఈ మేరకు పోలీసులకు అందిన ఫిర్యాదులతో సమగ్ర దర్యాప్తు జరపగా పాత నేరస్థుడు సూర్యానారాయణ చోరీలకు పాల్పడినట్లు నిర్ధారించి ఆదివారం అతనిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో సోమవారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అతనిపై ఇప్పటికే వివిధ పోలీసు స్టేషన్లలో 40 కేసులు నమోదయ్యాయని సీఐ వెల్లడించారు. రెండు నెలల క్రితమే జైలు నుంచి విడుదలయ్యాడని తెలిపారు. ఇతని నుంచి రూ.3.73 లక్షల విలువైన మూడు స్కూటర్లు, మూడు ల్యాప్‌ట్యాప్‌లు, ఒక గ్యాస్ సిలిండర్ స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సైలు లక్ష్మణరావు, సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తపరీక్షలు సక్రమంగా నిర్వహించాలి

● డబ్ల్యూహెచ్‌వో వైద్యాధికారి లక్ష్మీసుభద్ర

నెల్లూరు(వైద్యం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రక్త పరీక్షలు సక్రమంగా నిర్వహించి పక్కాగా వ్యాధిని నిర్ధారించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి వైద్యాధికారి లక్ష్మీసుభద్ర తెలిపారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న ల్యాబ్ టెక్నీషియన్‌లకు ఓరియంటేషన్, మలేరియా మైక్రోస్కోప్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మలేరియా, ఫైలేరియా పరీక్షల విధానంలో పాటించాల్సిన పద్ధతులను తెలియజేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ క్షయవ్యాధితో పాటు డెంగ్యూ, మలేరియా ఇతర పరీక్షలను సకాలంలో నిర్వహించి సరైన ఫలితాలు వైద్యాధికారులకు తెలియచేయాలని చెప్పారు. విధులకు సక్రమంగా హాజరవుతూ బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ వ్యాధుల తీవ్రత తగ్గాలంటే ల్యాబ్ టెక్నీషియన్‌లు నిర్వహించే పరీక్షలే ఆధారమన్నారు. రికార్డులను కూడా సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా సిబ్బంది, సూపర్‌వైజర్లు, సబ్‌యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు నలుగురు గైర్హాజరు

వెంకటాచలం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళా శాలల్లో సోమవారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షలకు నలుగురు విద్యార్థు లు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపా రు. మొత్తం 134 మందికిగాను 130 మంది హాజరయ్యారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	110
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	230
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7191
వెండి కిలో ధర	రూ. 91,800
వెండి ఒక గ్రాము	రూ.94.80

ఉపాధి పథకం సిబ్బంది ఏడుగురు సస్పెన్షన్

కొండాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత నెలలో జరిగిన ఉపాధి పనుల సామాజిక తనిఖీలో అక్రమాలు జరిగినట్లు తనిఖీ అధికారులు తేల్చారు. 2023-24లో 19 పంచాయతీలలో రూ.15కోట్ల తో పనులు జరగ్గా అందులో రూ.98లక్షలకుపైగా నిధులు దుర్వినియోగం అయినట్లు బహిరంగ విచారణలో అధికారులు నివేదిక ఇచ్చారు. దీనిపై జిల్లాస్థాయిలో ఉన్నతాధికారులు ఆడిట్ చేసి నిధులు దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. మండల ఏపీవో చెంచయ్య, ఈసీ శ్రీనివాసులు టెక్నికల్ అసిస్టెంట్లు కోటేశ్వరరావు, జవహర్, వెంకటరావు, గరిమెనపెంట, సత్యవేలు క్షేత్రసహాయకులు శ్రీనివాసులు, రమేష్‌ను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయని ఎంపీడీవో ఆదినారాయణరావు తెలిపారు.

మంచినీటి పథకానికి గ్రహణం



నిరుపయోగంగా శుద్ధి జల ట్యాంకు

● ఆదిలోనే అటకెక్కిన ప్రాజెక్టు ● నిర్వహణ పేరుతో నిధుల స్వాహా

● పరికరాల మాయంపై కలెక్టర్‌కి ఫిర్యాదు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వవ్వేరు పంచాయతీ కనిగిరి రిజర్వాయర్ వద్ద 2011లో తాగునీటి పథకాన్ని మంజూరు చేశారు. రిజర్వాయర్‌లోని జలాలను శుద్ధి చేసి, వవ్వేరు, కట్టుబడిపాళెం, రామచంద్రాపురం, ఇస్కపాళెం, చెల్లాయపాళెం, రేబాల గ్రామాలకు తాగునీటిని అందించాలనేది పథకం లక్ష్యం. మొత్తం 12 ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించేందుకు రూ.9కోట్లు విడుదల చేశారు. అయితే ఆదిలోనే ఈ ప్రాజెక్టును అటకెక్కించారు. వవ్వేరులోని ప్రాజెక్టు దగ్గర నుంచి ఎత్తైన ప్రదేశంలో ఓవర్‌హెడ్ ట్యాంకుల నుంచి నీటి సరఫరాకు పైపు లైన్లు ఏర్పాటు చేశారు. మొదట్లో వవ్వేరు, కట్టుబడిపాళెం, రామచంద్రాపురం గ్రామాల వరకే పరిమితం చేస్తూ, ట్యాంకుల నుంచి నీరు సరఫరాకి పైపులు ఏర్పాటు చేశారు. నీటి ప్రవాహ ఒత్తిడికి ప్రారంభంలోనే ఆ పైపులు పగిలిపోయాయి. పలుమార్లు మరమ్మతులు చేసినా లాభం లేకపోవడంతో పథకాన్ని గాలికి వదిలేశారు.

● నిర్వహణ పేరుతో నిధుల స్వాహా

ఈ పైలెట్ ప్రాజెక్టు పనిచేయకపోయినా నిర్వాహకులు, అధికారులు కలిసి ప్రతిఏటా నిర్వహణ పేరుతో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సుమారు రూ. 15నుంచి రూ. 20లక్షలకుపైగా నిధులను కొన్నేళ్లపాటు స్వాహా చేశారు. అయినా సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. వవ్వేరు లోని పైలెట్ ప్రాజెక్టు కోసం ఏర్పాటు చేసిన మోటార్లు, పైపులైన్లు, ఇతర పరికరాలు మాయంకాగా, కొన్ని పైపు లైన్లను, పరికరాలను స్థానిక సచివాలయంలోని ఓ ఉద్యోగి పాత ఇనుప సామాన్లు కింద అమ్మేశారని ఇటీవల కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



పంపు హౌస్‌లో మాయమైన మోటార్లు, ఇతర పరికరాలు

● అభివృద్ధి పేరుతోనూ..

బుచ్చి నగర పంచాయతీ ఏర్పాటయ్యాక కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.40లక్షల నిధులొచ్చాయి. వాటిని అప్పటి కమిషనర్ దారి మళ్లించి స్వాహా చేశారు. పేరుకే రూ.9కోట్ల పైలెట్ ప్రాజెక్టు పథకం. కనీసం పదిరోజులైనా ప్రజలకు తాగునీరు అందించలేదు. ప్రాజెక్టు నిర్వహణ, అభివృద్ధి పేరుతో వచ్చిన రూ.కోట్ల నిధులను స్వాహా చేశారు. ప్రస్తుతం సంగం బ్యారేజీ నుంచి బుచ్చికి తాగునీటి కోసం కొత్త ప్రాజెక్టును చేపట్టారు. ఈ క్రమంలో వవ్వేరు పైలెట్ ప్రాజెక్టు పథకంలో చోటుచేసుకున్న అక్రమాలు చర్చనీయాంశమయ్యాయి.



వవ్వేరు శివారులో నిర్మించిన పైలెట్ ప్రాజెక్టు, ట్యాంకులు, పంపుహౌస్

నిధులు మింగేశారు

తాగునీటి పథకం పనిచేయలేదు. ఆది నుంచి పైలెట్ ప్రాజెక్టు పేరుతో వచ్చిన నిర్వహణ, అభివృద్ధి నిధులను నిర్వాహకులు, అధికారులు కలిసి స్వాహా చేశారు. ఈ విషయమై ఇటీవల జరిగిన మండల సమా వేశంలో ఎమ్మెల్యే ఎదుట ప్రస్తావించాను. ఈ పథకంలో చోటుచేసుకున్న అక్రమాల గుట్టు ను రట్టు చేసి, నిధులను రికవరీ చేయాలని కోరాను.

- వినయ్ నారాయణ, ఎంపీటీసీ

ప్రజల అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

‘పీజీఆర్‌ఎస్’లో జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చే అర్జీదారులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వారి మండల కార్యాలయాల్లో అర్జీలు సమర్పించవచ్చన్నారు. మళ్లీ మళ్లీ వచ్చే అర్జీల విషయంలో రెవెన్యూ అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. 195 అర్జీలు వచ్చాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్, జడ్పీ సీఈవో మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

● శ్మశాన భూమిని కాపాడాలని..

నగరంలోని టైలర్స్ కాలనీలో అన్యాక్రాంతమైన ముస్లిం శ్మశాన భూమిని కాపాడాలని కోరుతూ ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మొహ్మద్ జియాఉల్‌హక్ వినతిపత్రం సమర్పించారు. టైలర్స్ కాలనీలో 5 ఎకరాల భూమిని ముస్లింల శ్మశానానికి కేటాయించగా అందులో 1.5 ఎకరాలు ఆక్రమణకు గురైందన్నారు. మిగిలిన భూమి కూడా ఆక్రమణకు గురవుతోందని, కాపాడాలని కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేత పందిటి సుబ్బయ్య

● బావిని పూడ్చి రిజిస్టర్ చేశారు

ఏఎస్ పేట మండల కేంద్రంలో 120 అంకణాల స్థలంలో నిర్మించిన పురాతన అతిపెద్ద బావి స్థలాన్ని ప్రసాదరావు, రాజశేఖర్, తదితరులు పూడ్చేశారని, ఆ బావిని వినియోగంలోకి తేవాలని కోరుతూ సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్యమాదిగ వినతిపత్రం సమర్పించారు. బావిని పూడ్చి ఆక్రమించటమే కాక, హైదరాబాదుకు చెందిన వారికి రూ.1.50 కోట్లకు రిజిస్టర్ చేసి విక్రయించారని ఆరోపించారు. ఆ బావి స్థలాన్ని కాపాడి మళ్లీ బావి తవ్వించాలని కోరారు.

చట్ట ప్రకారం న్యాయం చేస్తాం

● ‘పీజీఆర్‌ఎస్’లో ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ జీ కృష్ణకాంత్ హామీ ఇచ్చారు. సోమవారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో బాధితుల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

● తన ఇంట్లో అద్దెకు దిగిన ముత్తుకూరుకి చెందిన అరవింద్ అనాథ పిల్లలు, వృద్ధుల పేరుతో ఆశా ఫౌండేషన్ ట్రస్టు ఏర్పాటు చేస్తే దాని ద్వారా రెట్టింపు నగదు సంపాదించవచ్చని నమ్మించి తనవద్ద రూ.80 లక్షలు తీసుకుని పరారయ్యాడని నగరంలోని దర్గామిట్టకు చెందిన ఆశా ఫిర్యాదు చేసింది. ఈ నగదు తనకు తెలిసిన వారి నుంచి తీసి ఇచ్చానని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని ఆమె ఎస్పీని కోరారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

సమస్యలు పరిష్కరించకుంటే 25 నుంచి సమ్మె

కలెక్టరేట్ వద్ద ‘108’ ఉద్యోగుల రిలే నిరసన

నెల్లూరు(వైద్యం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : 108 అంబులెన్స్ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు ఒకరోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ 108 అంబులెన్స్‌లు ప్రభుత్వమే నిర్వహించాలని, ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. రోజుకు మూడు షిఫ్ట్‌లలో 8 గంటల పని విధినాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్యశాఖలో ఈఎంటీ పోస్టుల నియామకాల్లో 108లో పనిచేస్తున్న ఈఎంటీలను నియమించాలని కోరారు. సహజ, ప్రమాద మరణం పొందిన ఉద్యోగ కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రభుత్వం అధికారులు, 108 యాజమాన్యం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించక పోతే ఈ నెల 25వ తేదీన ఉద్యోగులు సమ్మె చేపడుతామని హెచ్చరించారు. ఇందుకు రాష్ట్ర ప్రజలకు జరిగే అసౌకర్యానికి యాజమాన్యం, ప్రభుత్వం, అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో 108 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి నాగరాజు, కోశాధికారి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షలో 108 అంబులెన్స్ ఉద్యోగులు

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు, సీఐటీయూ, ఆటో యూనియన్ నాయకులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వలంటీర్లు, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల ఔట్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ఆశా వర్కర్లు సోమవారం ధర్నా చేశారు.

● రూ.10వేల వేతనం ఇవ్వాలి

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.10వేలు జీతంతో వలంటీర్లు తిరిగి విధుల్లోకి తీసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్ల సంఘం నాయకుడు షేక్ హుమయూన్‌బాషా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు చెల్లించాలని కోరారు.

● రెగ్యులర్ చేయాలి

గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని ఆ యూనియన్ జిల్లా నాయకుడు శ్రీనివాసులు కోరారు. ఆ పాఠశాలల్లో 95 మంది ఉపాధ్యాయులు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారన్నారు. అనేక సంవత్సరాల నుంచి చాలీచాలని జీతాలతో వెట్టిచాకిరి చేస్తున్నామని చెప్పారు. వాళ్లకు ప్రాధాన్యత ఇచ్చి రెగ్యులర్ చేయాలన్నారు. ఈ ధర్నాలో నాయకులు అనిత, ఈవీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● ‘ఆశా’ ఒప్పందాలపై జీవో ఇవ్వాలి

నెల్లూరు(వైద్యం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర నేతలతో అప్పటి ప్రభుత్వం ఆశాల సమస్యలపై పలు ఒప్పందాలు చేసుకుందని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కావస్తున్నా అప్పటి జీవోను విడుదల చేయలేదన్నారు. ఆశా వర్కర్లకు సీఎం చంద్రబాబు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీవీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఆశాలకు కనీస వేతనం, ఈపీఎఫ్, ఈఎస్‌ఐ, ఎల్ఐసీ వంటి సంక్షేమ పథకాలు అమలు చేయకపోవటం దురదృష్టకరమన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజా, ఆశా వర్కర్స్ నేతలు సుభాషిణి, వసుంధర, శివకామేశ్వరి, సరిత, అనిత్, హేమ, స్వర్ణ, సుజాత, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు సుస్తీ చేస్తే మందుల్లేవ్!

- వైద్యులు, సిబ్బంది మందులు మార్కెట్‌కు తరలింపు
- వలేటివారిపాలెం. పోకూరు, వీఆర్ కోట పశువైద్యశాలల్లో ఇదీ పరిస్థితి

వలేటివారిపాలెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలతో పాటు పోకూరు, వీఆర్‌కోట గ్రామీణ పశువైద్యశాలలు ఉన్నాయి. ఈ వైద్యశాలలకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న పశువుల మందులను కొందరు వైద్యులు, సిబ్బంది నల్లబజార్లో అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ పశువైద్య కేంద్రాల్లో రోగనిర్ధారణ పరీక్షలు చేయడం ఎప్పుడో మానేశారు. అడపాదడపా పశుపోషకులు ఆసుపత్రులకు వచ్చినా మందులు లేవంటూ బయటకు రాసి కమిషన్లు దండుకుంటున్నారని ప్రజలు చెబుతున్నారు. పాడి పశువులకు ఎద సమయంలో ఇచ్చే సెమెన్ ఇంజక్షన్ కూడా ఉండటం లేదంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం అవుతుంది. కొందరు తెలసిన వ్యక్తులు ఈ విషయాలపై ప్రశ్నిస్తే ప్రభుత్వం నుండి మందులు సరఫరా కాలేందంటూ వైద్యులు మాటలతో బురిడి కొట్టిస్తున్నారు. పాడిరైతులు చేసేదిలేక బయట మార్కెట్‌లో సెమెన్ ఇంజక్షన్ ఒక్కోటి రూ.200 కొనుగోలు చేసి ప్రయివేట్ వైద్య సిబ్బందితో ఎదకు వచ్చిన గేదెలకు ఇంజక్షన్ వేయించుకొంటున్నారు. తెలసిన కొందరు రైతులకు మాత్రం పశువుల వీర్యాన్ని ఇచ్చి వారిని అక్కడ నుంచి సా గనంపుతున్నారు.

పశువులను ఏ అనారోగ్యంతో తీసుకెళ్లినా..

పశువులకు, సన్నజీవాలకు రోగం వచ్చి వైద్యశాలకు తీసుకెళ్లినా డీవార్మింగ్ యాంటిబయోటిక్, నొప్పులు, గాలికుంటు వ్యాక్సిన్ తదితర వ్యాధులకు మందులు లేవంటూ ఒకరికో ఇద్దరికో ఇచ్చి స్టాక్ లేదంటున్నారని పాడి రైతులు ఆదోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు చేసేదిలేక కనిగిరి వెళ్లి మందులు తెచ్చుకుని ప్రయివేట్ సిబ్బందితో వైద్యం చేయించుకుంటున్నారు. లెక్కల్లో మాత్రం రైతులకు రాయి తీపై ఇచ్చినట్లు చూపిస్తున్నారు. రోగాల వచ్చిన సమయంలో చేయాల్సిన పేడ, రక్తం మూత్రం, పాలు నమూనాలు తీసుకొని పరీక్షించి దాని బట్టే వైద్యం చేయాలి. కానీ వలేటివారిపాలెం, పోకూరు పశువై ద్యశాలల్లో పరీక్షలే చేయడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ విషయంలో విచారణ చేపట్టి సకాలంలో మందులు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



పోకూరు పశు వైద్యశాల

ఒకరిపై ఒకరు చెప్పకుంటూ దాటవేత

ఈ విషయంపై వలేటివారిపాలెం ఏడీ బ్రహ్మయ్య, పోకూరు పశువైద్యులు వంశీని ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ దాటవేస్తున్నారు.

నారుమడిలో జాగ్రత్తలు వహించాలి

అల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నారుమడి దశలో జాగ్రత్తలు తీసుకుంటే వరి సాగులో సులభంగా సస్యరక్షణ చేపట్టవచ్చని కావలి ఏడీఏ నాగరాజు తెలిపారు. సోమవారం ఆయన అల్లూరులోని పలు నారుమడులను సందర్శించారు. నాట్లు సమయంలో నారును తీసేందుకు ఐదురోజులు ముందు కార్బొఫ్యూరాజ్ -3జి గుళికలను వినియోగిస్తే ఆకుచుట్టు పురుగును అరికట్టవచ్చన్నారు. పైరు సమయంలో అత్యధికంగా యూరియా వినియోగిస్తే తెగుళ్లు వస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వర్లు, వీఏఏ వెంకట ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల మృతి చెందిన ఐదు కుటుంబ సభ్యులకు సోమవారం శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సత్ప్రవర్తనతో మెలగాలి

లింగసముద్రం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలిగి ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలని ఎస్సీ బాలుర వసతిగృహం వార్డెన్ రామకృష్ణ తెలిపారు. అసమానతలు రూపుమాపునకు కృషి చేసిన ఆధ్యాత్మిక గురువు కనకదాసు జయంతి సందర్భంగా వసతిగృహంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎస్టీలకు ఆధార్ శిబిరాలు

కందుకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ ఎస్టీలకు స్పెషల్ ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అనూష సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 నుంచి 22 వరకు, తిరిగి ఈ నెల 26నుంచి 29వరకు క్యాంపులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

ఓటరు జాబితాను సరిచేయండి

బిట్రగుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బోగోలు చెరువు ఎన్నికల ఓటరు జాబితాలోని తప్పులను రెవెన్యూ అధికారులు సరి చేయాలని సోమవారం వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు కోరారు. సర్వే నంబరు 20-1లోని అనుభవదారులు ఎవరూ ఓటరు జాబితాలో లేరన్నారు. సర్వే నంబరు 175కు సంబంధించి నీటిపారుదలశాఖ కేవలం 40 సెంట్లు చెరువు ఆయకట్టు ఉన్నట్లు జాబితా ఇస్తే రెవెన్యూ అధికారులు 7ఎకరాలకు సంబంధించి ఆయకట్టుదారులను జాబితాలో చేర్చి ఉన్నారని వాపోయారు.

గోల్డ్ మెడల్ విద్యార్థినికి నగదు

ఆత్మకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 రాష్ట్రస్థాయి 69 కేజీ కుస్తీ పోటీల్లో క్యాటగిరి విభాగంలోబట్టేపాడు ఉన్నత పాఠశాల విద్యార్థిని బంగారు పతకం సాధించింది. ఈమెకు సోమవారం డిప్యూటీ డీఈవో గోపాల్ రూ.5వేలు, రికార్డు అసిస్టెంట్ తోడేందల సురేష్ రూ.2వేలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో చలపతి, ప్రధానో పాధ్యాయుడు పెంచలయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణయ్య పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి

కలిగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కావలి నుండి కలిగిరి, కొండాపురం మండలాలకు వెళ్లే ప్రజలకు రాత్రివేళల్లో బస్సు సౌకర్యం కల్పించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నందనవనం ప్రభాకరరావు సోమవారం ఎంపీడీఓ ప్రత్యూషకు వినతిపత్రం అందజేశారు. వివిధ పనుల నిమిత్తం ఇతర పట్టణాలకు వెళ్లి ఈ గ్రామాల తిరిగి వెళ్లేందుకు రాత్రి 7:30సమయంలో కావలికి వస్తే బస్సులు ఉండవన్నారు. చేసేదిలేక కావలిలో రాత్రి పడుకోవాల్సి వస్తుందని వినతిలో పేర్కొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

- మస్తానయ్య, ఇన్‌చార్జి తహసీల్దారు, చేజర్ల



చేజర్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కరిస్తామని ఇన్‌చార్జి తహసీల్దారు మస్తానయ్య తెలిపారు.

ఇంటర్వ్యూ

? రీసర్వే గ్రామ సభలు ఎలా జరుగుతున్నాయి.

! ఇప్పటివరకు ఆరు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించాం. గతంలో జరిగిన రీసర్వేపై అభ్యంతరాలుపై రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నాం.

? ఇప్పటివరకు ఎన్ని అర్జీలు స్వీకరించారు.

! రైతుల నుంచి 326 అర్జీలు వచ్చాయి. వాటిని త్వరలోనే పరిష్కరిస్తాం.

? సాగునీటి సంఘాల ఎన్నికలకు రైతుల జాబితా సిద్ధం చేశారా.

! రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. రెవెన్యూ పరిధిలో ఉన్న జాబితాను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించాము.

? ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

! ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవు. చట్టపర చర్యలు తీసుకుంటాము.

సమస్యలు పరిష్కరిచాలని వినతులు

కావలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):గ్రామాల ప్రజలు సోమవారం ఆర్డీవో కార్యాలయ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవో వంశీక్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని పూలదొరువు నువ్వుశెట్టి వెంకటరమణయ్య ప్రభుత్వ భూములు ఆక్రమణలను గురించి వివరించారు. సమస్యను పరిష్కరించాలని అటవీశాఖ అధికారి శేషుకు సూచించారు. అలాగే కలిగిరి మండలం తూర్పుగుడ్లదొనయర్ల పోలయ్య తన పొలం రీసర్వేలో వేరొకరి పేరు మీద ఎక్కించారని, అయ్యపురెడ్డిపాలెంకు చెందిన ఓ రైతు తన భూమిని వేరొకరు రిజిష్టర్‌లో ఎక్కించుకున్నారని తెలిపారు. వసతిగృహాలలో కనీస వసతులు కల్పించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి విన్నవించారు. జలదంకి మండలంలోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయనిఇ వాటికి మరమ్మతులు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు తాళ్లూరు మాల్యాద్రి తెలిపారు. అలాగే కావలి పట్టణంలో ఎన్ని లేఅవుట్‌లు వేశారు ఎన్నిటికి ల్యాండ్ కన్వర్షన్ తీసుకున్నారో వాటివిరాలు తెలపాలని సమాచారహక్కు చట్టం కింద కోరారు.



వృద్ధుడి సమస్య వింటున్న ఆర్డీవో వంశీక్రిష్ణ

నివాస స్థలం 3 సెంట్లు ఇవ్వండి

- వ్యవసాయ కార్మికసంఘం నాయకుల ర్యాలీ

కందుకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల నివాస స్థలాల కోసం గ్రామాల్లో 3సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు స్థలం ఇచ్చి గృహ నిర్మాణానికి ఒక్కో కుటుంబానికి రూ.5లక్షలు అందజేయాలని సీపీఐ. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ బాల కోటయ్య, మురళి,ఆనంద్‌మోహన్ చేశారు. ఈ మేరకు సోమవారం కందుకూరు సీపీఐ కార్యాలయం నుంచి సబ్ కలెక్టరు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నెల్లూరు జిల్లా కార్యదర్శి పోకూరి మాలకొండయ్య, కందుకూరు ఏరియా కార్యదర్శి బూసి సురేష్‌బాబులు మాట్లాడారు. గతప్రభుత్వం ఇచ్చిన ఒక సెంటు స్థలం పేదలకు ఏమాత్రం సరిపోడం లేదన్నారు. కార్యక్రమంలో నత్తా రామారావు, బాలబ్రహ్మాచారి, సీహెచ్ దుర్గాప్రసాద్, కాకుమాని రమణమ్మ, పులి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ర్యాలీలో సీపీఐ, వ్యవసాయ కార్మికసంఘం నేతలు

ప్రజల ఫిర్యాదులు స్వీకరించేవారేరి..!

- అధికారుల డుమ్మా

ఉదయగిరి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు డుమ్మా కొట్టడంతో తమ సమస్యలపై అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు ఊసూరుమంటూ వెనుతిరగాల్సి వస్తోంది. సోమవారం స్థానిక, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన కార్యక్రమానికి 17 శాఖల అధికారులు పాల్గొనాల్సి ఉండగా 11గంటలకు కేవలం రెండు, మూడు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. సమయపాలన పాటిం చకుండా కొందరు అధికారులు వచ్చామా.. వెళ్లమా.. అంటూ, మరికొందరు తమ సిబ్బందిని పంపి రిజిస్టర్‌లో సంతకాలు చేయిస్తూ మమ అనిపిస్తున్నారు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అధికారులు హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

రాళ్లపాడుకు 1.50టీఎంసీల నీటిని విడుదల చేయాలి

- రాళ్లపాడు పరిరక్షణ కమిటీ నేతల డిమాండ్

లింగసముద్రం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల నుండి రాళ్ల పాడు ప్రాజెక్టుకు 1.50 టీఎంసీల నీటిని విడుదల చేయాలని సీపీఎం గుడ్లూరు ఏరియా కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, రాళ్లపాడు పరిరక్షణ సమితి నేతలతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 25వేల ఎకరాలు సాగుభూమి, వందకు పైగా గ్రామాలకు సాగు, తాగునీటిని అందించే ప్రాజెక్టుపై ప్రభుత్వాలు అశ్రద్ధ చూపుతున్నాయని వాపోయారు. ప్రాజెక్టు మరమ్మతులకు రూ.25కోట్లు కేటాయించాలన్నారు. ప్రాజెక్టు ఎడమ కాలువ పొడిగింపు పనులు 12ఏళ్లుగా ఒక్క అడుగు ముందుకు సాగడం లేదన్నారు. ప్రాజెక్టుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించాలన్నారు. అధికారుల, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావు, ప్రాజెక్టు ఏఈ చంద్రమౌళికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నేతలు వెంకటయ్య, కృష్ణయ్య, నాగేశ్వరరావు, నారాయణ, విజయలక్ష్మి, మాల్యాద్రి, సుభాని, సుధాకర్, జిలాని, ప్రవీణ్‌కుమార్, జయరాంరెడ్డి, రామయ్య, మల్లికార్జున ఉన్నారు.



లింగసముద్రం: తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

చట్టాలపై అవగాహన

అల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ తెగలకు సంబంధించిన చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని నెల్లూరు సీఐడీ డీఎస్పీ ఎన్.కోటారెడ్డి గిరిజనులకు తెలిపారు. అల్లూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం వారితో సమావేశమై మాట్లాడారు. గతంలో మాది రిగా వెట్టిచారికి చేయాల్సిన అవసరం లేద ని ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ ట్రైబ్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కోఆపరేషన్ సభ్యురాలు తిరువీధి అనూరాధ, కావలి రూరల్ సీఐ రాజేశ్వరరా వు, ఎస్ఐ కిషోర్‌బాబు, ఎంపీడీఓ రజనీకాంత్, కమిషనర్ ఉమామహేశ్వరరావు, వి ద్యాశాఖాధికారి రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

అనంతసాగరం, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి):సోమేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెం దిన ముత్యం కృష్ణ అన్న దానం ఏర్పాటు చేశారు. ధర్మకర్తలు ఉప్పల విజయ్ కుమార్, సోమసుందరమూర్తి పాల్గొన్నారు.

అధ్యక్షా.. ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించరూ !

- ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల విన్నపం

జలదంకి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ప్రాంతం ఫ్లోరైడ్ పీడిత ప్రాంతమని ఎంతోమంది పేదలు కిడ్నీవ్యాధి బారి నపడి అసువులు బాసారని, మరికొందరు సుదూర ప్రాంతాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నారని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోమవారం శాసనసభ దృష్టికి తీసుకెళ్లారు. ఉదయగిరి ప్రాంతంలో వైద్యఆ రోగ్యమంత్రి సత్యకుమార్ ఓ డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయించారని, మరిన్ని డయాలసిస్ సెంటర్లు మా ప్రాంతంలో అవసరమని ఈ విషయంపై మంత్రి స్పందించాలని చర్యలు తీసుకోవాలని కోరారు. ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలను 100పడకల స్థాయికి పెంచాలని కోరారు.



భూసమస్య పరిష్కరించాలని ఆందోళన

సీతారామపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భూ సమస్య పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సీతారామ పురం ఆదోని శేషయ్య గ్రామస్థులతో కలిసి ఆందోళన చేశారు. ఈసందర్భంగా రైతు మాట్లాడుతూ తన పేరు మీద ఉన్న మెట్ట భూమి గత నెల 17వ తేదీన ఆన్‌లైన్‌లో చూసుకోగా ఆదోని నాగరాజ పేరుతో మార్పు జరిగిందని అర్జీ ఇచ్చారు. ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. త్వరగా విచారణచేసి న్యాయం చేయాలని కోరాడు. కార్యక్రమంలో పిడుగు రమేష్, కాశీరత్తయ్య, రాజశేఖర్, నాగేశ్వరావు, బండి రవి, నారాయణ పాల్గొన్నారు.

భూ అక్రమణపై ఫిర్యాదు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భైరవరంలో తమ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించి సాగు చేస్తున్నాడని సోమవారం తహసీల్దారు నాగరాజుకు బాధితులు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వేనెంబర్ 69/2లో 5.03 ఎకరాల సీజేఎఫ్ఎస్ భూమిని గత కొన్నేళ్ల క్రితం తాళ్లూరి నరసయ్య పేరు మీద ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆయన మరణానంతరం కుటుంబ సభ్యులకు చెందాల్సిన భూమిని మరో వ్యక్తి ఆక్రమించి సాగు చేసు కుంటున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గుజ్జుల మల్లికార్జునపాల్గొన్నారు.

పట్టుబడినవి రేషన్ బియ్యమా ? నూకలా ?

లింగసముద్రం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టుపై తెల్లవారుజామున ఎన్‌ఫోర్స్ మెంటు అధికారులకు 40 బస్తాలలో పట్టుబడినవి రేషన్ బియ్యమా? లేక నూకల బియ్యమా అని అని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పామూరు నుండి కావలికి అక్రమంగా తరలుతున్నాయని కందుకూరు ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులకు సమాచారం అందడంతో వారు సోమవారం తెల్లవారుజామున 3గంటలకు రాళ్లపాడు ప్రాజెక్టుపై మాటు వేశారు. అదే సమయంలో వచ్చిన మినీవ్యానును వారు తనిఖీ చేయగా అందులో 40బస్తాలలో బియ్యం ఉన్నట్టుగా గుర్తించి లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డుపై మినీవ్యానును ఆపి లైటు వెలుతురులో తనిఖీ చేయగా బస్తాలలో ఉన్నవి బియ్యం కాదని నూకలని వదిలేసినట్టు తెలిసింది. ఈ విషయమై కందుకూరు ఎన్‌ఫోర్స్‌మెంటు డీటీ చెంచురామయ్యను వివరణ కోరగా పట్టుకున్నవి నూకలని తేలడంతో వదిలేసినట్టు చెప్పారు.

శివాలయ నిర్మాణానికి భూమిపూజ



జలదంకి: పాల్గొన్న సర్పంచి దంపతులు



సంగం: భూమి పూజ చేస్తున్న సర్పంచి నాజున్ని

జలదంకి, నవంబర్ 18 (ఆంధ్ర జ్యోతి): సోమవరప్పాడులో శివాలయం నిర్మాణానికి సోమవారం సర్పంచ్ దంపతులు చేవూరి జనార్దన్‌రెడ్డి, సులోచ నమ్మలు భూమిపూజ చేశారు. పండి తుల వేద మంత్రోచ్ఛరణల మధ్య ఉద యం శివుడు, పార్వతీదేవి గర్భగుడుల నిర్మాణానికి అంకురార్పణ చేశారు. ఇప్పటికే గ్రామంలో సర్పంచ్ దంపతులు సాయిబాబా మందిరాన్ని నిర్మించారు. పూజల్లో స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అయ్యప్పమాలధారులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పనులకు భూమిపూజ

సంగం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలుపూరుపాడులో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం సర్పంచ్ నాజున్ని భూమిపూజ చేశారు. నిర్మాణ పనులకు రూ. 7 లక్షలు మంజూరవడంతో ఎస్సీ కాలనీలో సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు.

- వరికుంటపాడు: గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రస్తుత ప్రభుత్వం అధిక నిధులు వెచ్చించి శ్రీకారం చుట్టిందని పంచాయతీరాజ్ ఏఈఈ రవీంద్రనాథ్ అన్నారు. సోమవారం గణేశ్వరాపురంలో సిమెంట్‌రోడ్ల నిర్మాణ పనులను ఆయన భూమి పూజ చేసి ప్రారంభించారు. నాణ్యతాప్రమాణాలతో పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుధీర్‌బాబు, గుత్తేదారు పేరం సుధాకర్‌రెడ్డి, సిబ్బంది రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ లక్కీడిప్ బహుమతుల అందజేత

కావలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సురక్షితం, సౌకర్యవంతమైన ఆర్టీసీ బస్సులో వెళ్లే ప్రయాణికులను ప్రోత్సహించేందుకు కావలి ఆర్టీసీ డిపో మేనేజరు రాపూరు శ్రీనివాసులు లక్కీడిప్ బహుమతులను అందజేశారు. స్థానిక ఆర్టీసీ డిపో ఆ వరణలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కొండా పురం, లింగసముద్రం, అల్లూరు రూట్లలో ప్రయా ణించిన వారి టిక్కెట్లను లక్కీ డిప్ తీసి రామస్వామి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఒక్కో రూట్‌లో ఒకరికి చీరలు ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు (ట్రాఫిక్) ఎం.కల్పన, ట్రాఫిక్ సూపరింటెండెంట్ రామకృష్ణ, బస్సుస్టేషన్ ఇన్‌చార్జి రమేష్ బాబు, రవిప్రకాష్ ఉన్నారు.



బహుమతులు ఇస్తున్న అధికారులు

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయా లని మండల బీజేపీ అధ్యక్షుడు చుండి హరిగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నర్రవాడ బీజేపీ కార్యాలయంలో కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులిచర్ల నారాయణరెడ్డి, కిసాన్‌మోర్చా మాజీ అధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు, బూత్ కమిటీ అధ్యక్షులు ఉన్నారు.

- వింజమూరు: బీజేపీని బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా ప్రతినిధి పెంచలయ్య అన్నారు. పట్టణ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు డేగ మధుయాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటనారాయణరెడ్డి, నాయకులు రాజశేఖర్, బాలకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.
- బిట్రగుంట: బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్టీ విల్సన్ సోమవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులుయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. కార్యక్రమంలో పార్టీ పటణాధ్యక్షుడు కుట్టుబోయిన బ్రహ్మానందం, స్థానిక నేతలు ఉన్నారు.

గ్రంథాలయాలపై అవగాహన

కావలి రూరల్ (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల విశిష్టతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని లోక్ అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి తెలిపారు. మాతినవారిపాలెం ప్రాథ మికోన్నత పాఠశాలలో సోమవారం ని ర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్ర మంలో హెచ్ఎం రాధాక్రిష్ణ పాల్గొన్నారు.

ఇంద్రాక్షి అమ్మవారి ఆలయంలో చోరీ

మర్రిపాడు, నవంబరు (ఆంధ్రజ్యోతి) 18: చుంచులూరులోని ఇం ద్రాక్షి అమ్మవారి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. హుండీతో పాటు అమ్మవారి మంగళ సూత్రాలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగి లించారు. గేటు తాళాలు పగలకొట్టి ఉండటాన్ని సోమవారం తెల్లవారు జామున స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. సం ఘటనా స్థలాన్ని పరిశీలించి ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

మాతమ్మ ఆలయంలో...

- అనంతసాగరం: పడమటికంబంపాడు గ్రామదేవత మాతమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దుండగులు గుడి తాళాలు పగులగొట్టి మూడు సవర్ల మంగళసూత్రాన్ని దోచుకెళ్లినట్లు స్థానికులు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కొత్తపల్లి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకురువారిపల్లికి చెందిన పిచ్చిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. మోటారుబైక్ అదుపుతప్పడంతో గాయపడిన పిచ్చిరెడ్డిని 108 వాహనంలో ఆత్మకూరు ప్రయివేటు వైద్యశాలకు తరలించారు.

అదుపుతప్పి కల్వర్టు గోడను ఢీకొన్న లారీ

- మర్రిపాడు: చుంచులూరు సమీపంలో 565వ నెంబరు జాతీయ రహదారిపై లారీ అదుపుతప్పి కల్వర్టు గోడను ఢీకొన్న సంఘటన సో మవారం తెల్లవారుజామున జరిగింది. డ్రైవర్ నిద్రమత్తులోకి వెళ్ల డం తో ఈప్రమాదం జరిగింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. అలా గే శింగనపల్లిలో బెల్టుషాపు నిర్వహిస్తున్న శ్రీనివాసులుపై పోలీ సులు కేసు నమోదు చేసి అతనివద్ద 15మద్యం సీసాలను స్వాధీనం చేసుకు న్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు.

పథకాలను చిరువ్యాపారులు సద్వినియోగం చేసుకోండి

కందుకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): చిరువ్యాపారులు, వీధి వ్యాపారులు ఆర్థిక స్వావ లంభన సాధించటమే లక్ష్యంగా కేంద్రం అనేక పథకాలతో ప్రోత్సాహకాలు, హామీలేని రుణాలు అందజేస్తుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ కె.అనూష కోరారు. ఈ పథకాలపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ మేనేజరు సుందరరావు, మెప్మా సీఎంఎం సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ కేంద్ర పథకాలు అందాలి

కావలి టౌన్, నవంబరు 18: అర్హులైన ప్రతిఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ భారతి తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో వీధి విక్రయదారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వనిధి, స్వాభిమానం, పక్వాడ తదితర పథకాలు వీధివిక్రయదారులకు అందేలా వారి వివరాలు డిజిటలైజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. వీరి అకౌంట్‌లు డిజిటలైజ్ చేసి (ఫోన్‌పే, గుగూల్ పే, భారత్ పే) వారికి రుణాలు అందేలా చూడాలన్నారు. కేంద్ర 8పథకాలను ప్రయోజనాలు వారికి అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సౌజన్య, లేబర్ డిపార్ట్‌మెంట్‌నుంచి రమేష్‌నాయుడు అధికారులు సిబ్బంది వీధి విక్రయదారులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన శైవ క్షేత్రాలు

సీతారామపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన శైవక్షేత్రాలు ఘటిక సిద్దేశ్వరం, భైరవకోన, సీతారామపురంలోని శివాలయాలు కార్తీక సోమవారం సందర్భంగా భక్తులతో పోటెత్తాయి. తెల్లవా రుజామునుంచే భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.

- ఉదయగిరి రూరల్: కార్తీక మాసం సందర్భంగా మండలంలోని పలు శివాలయాల్లో సోమవారం భక్తులు కార్తీక దీపాలు వెలగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని గండిపాళెం, గుడినరవ, అప్పసముద్రం, లింగాలదొన, యర్రబల్లిగడ్డ, అర్లపడియ గ్రామాలతోపాటు పట్టణంలోని పార్వతీ పరమేశ్వరాలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అలాగే దుత్తలూరు కొండపై ఉన్న రామలింగేశ్వరస్వామిని భక్తులు అధికసంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకులు స్వామివారికి అభిషేకాలు, పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

అడుగు ముందుకు వేయలేకున్నాం..



బురదమయంగా కొత్తూరు రోడ్డు

బిట్రగుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామం పంచాయతీకి దూరంగా అటవీప్రాంతానికి దగ్గరగా ఉంది. గ్రామంలోని రోడ్లు ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారాయి. అడుగు తీసి అడుగు ముందుకు వేయలేక పోతున్నామని సోమవారం స్థానికులు వాపోయారు. ఏ పార్టీ రాజకీయ నేతలైనా ఎన్నికల సమయంలో కనిపించి రోడ్లు బాగుచేస్తాం అని చెప్పి ఓట్లు వేయించుకుంటారు. గెలిచిన తరువాత ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈమారు జరిగే పంచాయతీ ఎన్నికలు వస్తున్నాయని ఈ సారి మరచిపోమని హెచ్చరిస్తున్నారు.

వేగ నియంత్రణకు విన్నూత చర్యలు

కావలి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వేగ నియంత్రణకు విన్నూతన రీతిలో చర్యలు తీసుకుంటామని హైవే రూట్ అధికారి నరశింహారావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింహపురి ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి పక్కన ఉన్న బస్ షెల్టర్లకు రంగులు వేసి వాహనదారులకు వేగ నియంత్రణపై అవగాహన కలిగేలా పలు కొటేషన్లను రాయించినట్లు తెలిపారు.

కిటకిటలాడిన కాటేపల్లి శివాలయం

తోటపల్లిగూడూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటేపల్లిలో గల కామాక్షి సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో మూడవ కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు దీపాలను వెలిగించి దైవదర్శనం చేసుకున్నారు. మండపం గ్రామ సర్పంచు కల్లిరెడ్డి సుబ్బారావు కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

● జొన్నవాడలో కార్తీక దీపాల శోభ

బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో మూడవ కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయమంతా దీపకాంతులతో మెరిసిపోయింది. అర్చకులు మల్లికార్జునస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం.అమ్మవారికి శ్రీచక్ర నవావరణ పూజలు నిర్వహించారు. కాగా జొన్నవాడ ఆలయం వద్ద సోమవారం అయప్ప దీక్షా పరులు మెట్లపూజను వైభవంగా నిర్వహించారు. భజనలు, అ య్యప్ప శరణుఘోష, ప్రత్యేక వాయిద్యాలతో పా డిన భక్తి గీతాలతో అయ్యప్పలు భక్తులను అలరించారు.

● నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం

పొదలకూరు (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయంలో కార్తీకమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని శివపార్వతుల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. సాగింది. ప్రత్యేక మండపంలో పార్వతీ పరమేశ్వరులను కొలవుతీర్చి, పట్టువస్త్రాలు, ముత్యాల ఆభరణాలు, వివిధ రకాల పూలతో అలంకరించి కల్యాణతంతు నిర్వహించారు. ఈ వేడుకలను పురోహితులు ప్రసాద్‌స్వామి, కుమార్‌స్వామి, శివస్వామి నిర్వహించారు. అలాగే శివాలయంలోని స్ఫటిక లింగేశ్వరుడికి, నర్మదబాణ లింగాలకు ప్రత్యేక అభిషేకాలు, కొనసాగాయి.

● శివనామ స్మరణతో మార్మోగిన సిద్దులకోన

సైదాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దేశ్వరకోనలో సోమవారం తిరునాళ్ళ నిర్వహించారు. ఈ సందర్భంగా నవకోటి సిద్దేశ్వర, నవనాథ సిద్దేశ్వర, శిష్యుడు సారంగధర స్వాముల వారికి దేవరులు విశేష పూజలు నిర్వహించారు. శివనామ స్మరణతో సిద్దలకోన మారు మోగింది. భక్తులు మంత్ర పుష్పం పూజలు నిర్వహించారు. మహిళలు దీపారాధనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మేధా దక్షిణామూర్తి స్వామికి విశేష పూజలు నిర్వహించారు. కార్య నిర్వాహకులు భక్తులకు మధ్యాహ్నం అన్న వితరణ నిర్వహించారు. రాపూరు సీఐ విజయకృష్ణ స్వామి వార్లను దర్శించుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎస్ఐ కాంతికుమార్‌కు సూచనలు చేశారు.




టీపీ గూడూరు మండలం కాటేపల్లి శివాలయం, జొన్నవాడ ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు



బుచ్చి : జొన్నవాడ ఆలయంలో పడిపూజ

అన్ని ప్రాంతాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేయండి

● ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ



విగ్రహం ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇస్తున్న పీపుల్స్ పార్కు కమిటీ నిర్వాహకులు

నెల్లూరు(సిటీ), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్ని ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో విద్యుత్ వీధి లైట్లు ఏర్పాటు చేయాలని ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగంతో పాటు పలు విభాగాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్‌తో కలసి మాట్లాడుతూ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు విద్యత్ శాఖతో సమన్వయం చేసుకుని కొత్త లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు పాతలైట్లు, మరమ్మతులకు గురైన వాటిని గుర్తించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే నగరంలోని అన్ని పార్కుల్లో ప్రజలకు వ్యాయామంపై అవగాహన, శిక్షణ ఇచ్చేందుకు కోచ్‌లను ఏర్పాటు చేస్తున్నామని, అర్హులైన వారు దరఖాస్తులు అందించాలని కమిషనర్ కోరారు.

● ఆనం వెంకటరెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలి

నగరంలోని ముత్తుకూరు కూడలిలో గతంలో తొలగించిన ఆనం వెంకటరెడ్డి విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని పీపుల్స్ పార్కు ఆర్గనైజింగ్ కమిటీ నిర్వాహకులు చినిగా శ్రీనివాసులురెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజకు వినతిపత్రం అందచేశారు. ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా అక్కడ ఉన్న ఆనం విగ్రహాన్ని తొలగించారన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయినందున తిరిగి ఆ స్థానంలో విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే 18వ డివిజన్‌లోని కేవీఎస్ఆర్ నగర్‌లో పైపులైన్లు ఏర్పాటు చేయాలని, రామాలయం, సర్వేపల్లి కాలువ కట్టపైన పోలేరమ్మ గుడి వద్ద రోడ్లపై ప్యాచ్ వర్కులు చేయాలని ఆ డివిజన్ కార్పొరేటర్ టీ అశోక్‌కుమార్ కోరారు. 54వ డివిజన్‌లోని టిడ్కో కాంప్లెక్స్ సముదాయం వద్ద భూగర్భ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఆ ప్రాంత కార్పొరేటర్ షేక్ సఫియాబేగం కోరారు. పలువురు పుర ప్రజలు వారి సమస్యలపై వినతులు అందజేశారు.

● పువ్వుతో నవ్వులు

మీరు బాగా పని చేస్తున్నారు.. నాకు చాలా సంతోషంగా ఉంది.. ఈ మధ్య జటాయి అనే యంత్రాన్ని తీసుకువచ్చి రోడ్లపై చెత్తనంతా తీయిస్తున్నారు. అలాంటి యంత్రం మన రాష్ట్రంలో మరెక్కడ లేదు.. మీకు నా అభినందనలు అం టూ ఓ సీనియర్ సిటిజన్ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కమిషనర్ సూర్యతేజకు రోజా పువ్విచ్చారు. దీనిని చూసిన తోటి అర్జీదారులు ఉద్యోగులు కాసేపు సరదాగా నవ్వుకున్నారు.

బస్సుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

● ఆర్టీసీ వన్‌డిపో డీఎం మురళీకృష్ణ



నెల్లూరు (స్టోన్ హౌస్‌పేట), (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో బస్సుల మెయింటెనెన్స్ సక్రమంగా లేకపోతే ప్రమాదాలు జరుగుతాయి. మార్గమధ్యంలో ఎక్కడ పడితే అక్కడ బస్సులు నిలిచిపోయే అవకాశం ఉంది. ఈ క్రమంలో బస్సుల మెయింటెనెన్స్‌పై జాగ్రత్తలు తీసుకుంటు న్నామని ఆర్టీసీ వన్‌డిపో డీఎం మురళీకృష్ణ వివరించారు.

? బస్సుల మెయింటెనెన్స్‌కు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఈ వారం

! : కూటమి ప్రభుత్వం బస్సుల మెయిం టెనెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారిం చింది. అందులో భాగంగా ప్రత్యేకమైన రిజిస్టర్ ఏర్పాటు చేసుకొని రోజూ డిపో గ్యారేజీ నుంచి బస్సు బయ టకు వచ్చే సమయంలో బస్సు ఫిటినెస్‌ను మెకానిక్‌లు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. బస్సును మరమ్మ తులు చేసి డ్రైవర్లకు అప్పగి స్తారు.

?: బహుమతుల అందించడం ద్వారా ప్రయో జనం.

! : బుచ్చి వైపు వెళ్లే బస్సుల్లోని ప్రయాణికులకు లక్కీ డిప్ తీసి ముగ్గురు ప్రయాణికులకు బహుమతులు అందచేస్తున్నాం. ఈ విధానం రెండు నెలలుగా అమలులో ఉంది. దీని ద్వారా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో డిపోకి ఆదాయం వస్తున్నది.

? : నగరంలో ఆర్టీసీ బస్సులు నడిపే అవకాశం ఉందా?

! : నగరంలో ఆర్టీసీ బస్సులు నడపాలంటే ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి. ప్రస్తుతానికి ప్రధాన బస్టాండ్ నుంచి అయ్యప్పగుడి వరకు రూ. 10 టికెట్ తీసుకుంటున్నాం. ఈ ప్రక్రియ ఇప్పుడిప్పుడే ప్రజల్లోకి వెళుతోంది.

ముత్తుకూరులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్



వైద్యులతో మాట్లాడుతున్న రాజగోపాల్

ముత్తుకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముత్తుకూరులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. కృష్ణపట్నంలో సోమవారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ముతుకూరు పీహెచ్‌సీని కమ్యూనిటీ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్చేందుకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సీఎంతో మాట్లాడి ప్రతి పాదనలు సిద్ధం చేశారన్నారు. పరిశ్రమల కాలుష్యం కారణంగా అధికశాతం ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న వైద్యులతో మాట్లాడారు. అనంతరం కామాక్షి సమేత మనుమసిద్ధేశ్వర ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్తీక మాస పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు నీలం మల్లికార్జునయాదవ్, ఈపూరు మునిరెడ్డి, ఏకొల్లు కోదండయ్య, ఏడుకొండలు, తొండమనాటి శ్రీధర్‌పిళ్లై, బొలిగర్ల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రైతులకు మేలు

మనుబోలు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు జరిగిందంటే అది టీడీపీ హయాంలో నేనని తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి అన్నారు. సోమవారం మనుబోలు పెద్దచెరువు కలుజువద్ద ఉన్న మూడు తూములకు చెక్కలను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దచెరువుతూములు బాగుచేయించాం. అలాగే కలుజు చెక్కలు కొత్తవి అమర్చి రైతులకు ఇబ్బందులు కలగకుండా చేయగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ. కృష్ణ, రైతులు కలికి సుధీర్‌రెడ్డి, సమాధినాగయ్య, పచ్చిపాల శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల రద్దుకు ధర్నా

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు18(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని సీపీఎం నాయకుడు గండవరపు శ్రీనివాసులు అధ్వర్యంలో సోమవారం బుచ్చిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ ఇంధన చార్జీలు ప్రభుత్వమే సర్దుబాటు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో స్మార్ట్‌మీటర్లు వినియోగదారులకు అమర్చితే పగలగొట్టమని కేసులైతే నేను చూసుకుంటానని నారా లోకేష్ పలికారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ మీటర్లు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పులిగండ్ల శ్రీరాములు, పీ శ్రీనివాసులు, రఘురామయ్య, జానకిరామయ్య, మునుస్వామి, జానీబాష, మునీర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

విడవలూరు,నవంబరు18(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విడవలూరు గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్ పాల్గొని గ్రంథాలయం ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో లైబ్రరీయన్ నిరూప, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో మెలకువలపై అవగాహన

వెంకటాచలం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విపత్తుల సమయంలో పాటించాల్సిన మెలకువలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగిఉండాలని వీఎస్‌యూ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో ఎన్ఎస్ఎస్ యూనిట్ - 3, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్ఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జాతీయ విపత్తుల నిర్వహణ అంశంపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిసి ఉంటే, వారి కుటుంబాన్నే కాకుండా, వారి చుట్టుపక్కల ఉన్న సమాజాన్ని కూడా రక్షించగలుగుతారన్నారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి బీ సందీప్‌కుమార్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహె చ్ విజయ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

నెల్లూరు(క్రైం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన నగరంలోని వీఆర్‌సి సెంటర్‌లో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. జెండావీధి సమీపంలో నివాసం ఉంటున్న షేక్ నూర్జాహన్(48) సోమవారం సాయంత్రం ఆమె మందులు తీసుకొని వీఆర్‌సీ సెంటర్ సమీపంలో నడుచుకుంటూ వెళుతుండగా వాకాడు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు వేగంగా ఢీకొంది. దీంతో కిందపడ్డ ఆమెపై బస్సు ముందు చక్రాలు ఎక్కడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం స్థానికులు సమీపంలోని జయభారత్ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి చిన్న కుమారుడు హైదర్ ఆలీ సౌత్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

డాబాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు క్రైం, (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు డాబాలపై సోమవారం దాడులు చేశారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం 'డాబార్లు' అంటూ వచ్చిన క థనానికి స్పందించిన ఎక్సైజ్ అధికారులు ఈ దాడులు చేశారు. ఎక్సైజ్ నెల్లూరు-2 ఇన్‌స్పెక్టర్ ప్రసన్నలక్ష్మి, ఎస్ఐ ఎస్‌డీ మునీర్ అహ్మద్‌లు ఇరుకళల పరమేశ్వరి ఆలయం సమీపంలోని డాబాలో తనిఖీలు చేశారు.

మద్యం దుకాణం వద్దు

నెల్లూరు సాంస్కృతికం, (ఆంధ్రజ్యోతి): నగరంలోని పరమేశ్వరినగర్‌లో ఏర్పాటు చేస్తున్న మద్యం షాపు వద్దంటూ స్థానికుల నిరసన సోమవారం కూడా కొనసాగింది. 15రోజులుగా చేస్తున్న ఆందోళనను అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే కురుగొండ్ల సహకారంతో సీసీ రోడ్లకు మోక్షం

సైదాపురం, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగణంరాజుపాళెం పంచాయతీ పరిధిలోని ఎర్రసంఘం గిరిజన కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను టీడీపీ నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సహకారంతో గ్రామాల్లో సీసీ రోడ్లకు మోక్షం కలిగిందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నందిమండలం రవీంద్రరాజు, నందిమండలం వెంకటేశ్వర్లురాజు తదితరులు పాల్గొన్నారు.

గందరగోళంగా జాబితా

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు18: మండలంలోని రేబాల, దామరమడుగు, పెనుబల్లి, వవ్వేరు, న్యూవవ్వేరు కాలువలకు సంబంధించి ఐదు నీటి సంఘాల పరిధిలోని 58 టీసీలకు ఎన్నికల నిర్వహణకు తయారు చేసిన ఓటర్ల జాబితాలో గందరగోళం నెలకొంది.ఈ విషయమై పలువురు రైతులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ, తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. నెల్లూరు ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం నోటీసు బోర్డులో పెట్టిన ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు, మరణించిన వారిపేర్లు ఉన్నాయని తహసీల్దార్‌కు జాబితాను చూపించారు. జేసీ దృష్టికి కూడా తీసుకెళ్లగా, ఆయన బుచ్చి తహసీల్దారుతో మాట్లాడారు. కాగా కొంతసేపటికి బుచ్చి ఇరిగేషన్ డీఈఈ బాధిత రైతుకు ఫోన్‌చేసి ఇంత చిన్న విషయానికి ఫిర్యాదు చేయడం ఎందుకని అడిగారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు18(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీవీ శేషులు అన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవంలో భాగంగా బుచ్చిలో సోమవారం జరిగిన మండల మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాలల పనివేళల్లో మార్పు తగదని, గ్రామీణ ప్రాంతాల్లో ఈ టైంటేబుల్ విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. జీవో నెంబరు 117రద్దు చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి శ్రావణ్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. బుచ్చి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వీవీ.ప్రసాద్, అధ్యక్షుడిగా జెడ్ కృష్ణమోహన్, అసోసియేట్ అధ్యక్షులుగా పీ దొరసానమ్మ, జీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎస్. హజరత్‌బాబు, కోశాధికారిగా వీ వేణుగోపాల్‌ను ఎన్నుకున్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

కొడవలూరు,నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కోవూరు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కృషి చేస్తున్నారని నీటి సంఘం మాజీ అధ్యక్షుడు కేతు వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలనే లక్ష్యంతో వేమిరెడ్డి దంపతులు ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం జాబ్‌మేళా సీఈవో కార్తీక్ మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, శ్రీనివాసులు, బెంజి, రమణయ్య, ఏకొల్లు వంశీధర్ రెడ్డి, విజయకుమార్ పాల్గొన్నారు.

డీలర్‌పై చర్యలేవి ?

తోటపల్లిగూడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాలెం చౌక దుకాణం డీలర్‌పై చర్యలు తీసుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమైనట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. షాపు నెంబరు-3 డీలర్‌గా పనిచేస్తున్న ఇరుగు సాయిబాబా తన డీలర్‌షిప్‌నకు రాజీనామా చేశారు. ఆయన పనిచేసిన సమయంలో సుమారు రెండు టన్నుల బియ్యం దుర్వినియోగమైనట్లు అధికారులు గుర్తించారు. కానీ ఇప్పటివరకు అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం వెంకన్నపాలెం డీలర్ ఇన్‌చార్జ్‌గా ఉన్నప్పటికీ కొత్తపాలేనికి రేషన్ రావడంలో జాప్యం జరుగుతూ కార్డుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డీలర్‌పై చర్యలు తీసుకుని, సరుకులు ఆలస్యం కాకుండా చూడాలన్నారు.

శంభో.. శివ శంభో..

● కార్తీక దీపాలతో ఆలయాలకు శోభ



స్వర్ణలింగేశ్వరాలయంలో నిర్వహించిన శివపార్వతుల శాంతి కల్యాణంలో పాల్గొన్న ప్రముఖులు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శైవ క్షేత్రాలు 3వ కార్తీక సోమవారం సందర్భంగా శివోహం శంభో శంకర, హరహర శంకర నామస్మరణలతో మారుమోగాయి. మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో సూర్యోదయంకు ముందు నుంచే భక్తులు బారు లు దీరి స్వామికి పాలాభిషేకాలు చేశారు. రాత్రి కార్తీక దీపాలు పెట్టేందుకు భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. వివిధ ఆకృతుల్లో వెలిగించిన కార్తీక దీపాలతో ఆలయం కళకళలాడింది. రాత్రి శివపార్వతులకు ప్రాకారోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో జె.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

● రాజరాజేశ్వరి ఆలయంలో మీనాక్షి సమేత సుందరేశ్వరస్వామికి పాలాభిషేకాలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు భారీగా జరిగాయి. రాహుకాల పూజ, సాయంత్రం కార్తీక దీపాలంకరణ నయనానందకరంగా జరిగింది. రాత్రి సుందరేశ్వరస్వామికి, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంభ హారతులు జరిగాయి. ఈ కార్యక్రమాలను జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

● వాహబ్‌పేట ఉమామహేశ్వరాలయంలో పాలాభిషేకాలు, పల్లకీసేవ, భక్తులకు అన్నప్రసాద వితరణ, మూలవర్లుకు చందనా అలంకారం, రాత్రి ప్రత్యేక సెట్టింగ్‌లో స్వామివారికి అలంకారం జరిగాయి. ఆలయ అధ్యక్షుడు బాలాజీసింగ్ పర్యవేక్షించారు.

● మూలాపేట నీలకంఠేశ్వరాలయం, నవాబుపేట మల్లేశ్వరస్వామి ఆలయం, ఉస్మాన్‌సాహెబ్‌పేట కాశీవిశ్వనాథస్వామి ఆలయం, సుజాతమ్మకాలనీ, ఉమానాగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం పూజలు, దీపాల అలంకరణలు వైభవంగా జరిగాయి.

● కమనీయం శివపార్వతుల శాంతి కల్యాణం

నగరంలోని మూలాపేట గణేష్ ఘాట్‌లో కామాక్షి సమేత స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయ మహాకుంభాభిషేకం ఉత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి శివపార్వతుల శాంతి కల్యాణం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదానం జరిగాయి. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో స్వర్ణభారత్ ట్రస్ట్ ఎండీ దీపావెంకట్, బీజేపీ నాయకులు పీ.సురేంద్రరెడ్డి, విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి, సింహపురి లక్ష కార్తీక దీపోత్సవ సమితి నాయకులు పాల్గొన్నారు.

● అయ్యప్పకు ఘనంగా మండల పూజలు

నగరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మండల పూజలు కొనసాగుతున్నాయి. కార్తీక సోమవారం భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. వివిధపూజలు, శ్రీవేలి ఉత్సవం ఘనంగా జరిగాయి. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం పూలంగిసేవ, మహాదీపారాధన, పడికర్పూర హారతులు జరిగాయి. ఈ కార్యక్రమాలకు ఉభయదాతలుగా కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ దే వరాల సుబ్రహ్మణ్యం, మస్తానమ్మలు వ్యవహరించారు. ఆలయం అధ్యక్షుడు జీవీ శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్యలు పర్యవేక్షించారు.

రంగనాథస్వామి ఆలయంలో షాపులకు వేలంపాట

నెల్లూరు సాంస్కృతికం ,(ఆంధ్రజ్యోతి): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయానికి చెందిన గృహాలు, షాపులకు సోమవారం వేలం పాటలు జరిగాయి. ట్రంకురోడ్డు వినాయకమహల్ ఎదురుగా ఉన్న రెండు షాపులకు గతంలో నెలకు రూ.8700 ఉండగా రూ.12,200 పాట జరిగింది. నవాబుపేటలో కొత్తగా నిర్మించిన 4 షాపులకు నెలకు రూ.34,700 చొప్పున, చిత్రకూటం, నవాబుపేటలోని రెండు షాపులకు నెలకు రూ.12,200 చొప్పున పాటదారులు పాడుకున్నారు. ఈ షాపులకు గత సంవత్సరం నెలకు రూ.4,250 ఉంది. గోపురం వీధిలో ఉన్న ఇంటికి నెల అద్దె గతంలో రూ.4800 పాడారు. గోపురం వీధిలో ఉన్న ఖాళీ స్థలాలకు గత సంవత్సరం అద్దె నెలకి రూ.5100 ఉండగా సోమవారం జరిగిన పాటలో రూ. 5,500 పాడారు. ఇన్‌స్పెక్టర్ ఎం.సుధర్, చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో పర్యవేక్షించారు.

పేదలందరికీ నివేశన స్థలాలు ఇవ్వాలి : సీపీఐ

కోవూరు, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ నివేశన స్థలాలు కేటాయించాలని సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి రామరాజు డిమాండు చేశారు. స్థానిక సచివాలయం ఎదుట సోమవారం సీపీఐ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం కేటాయించే సెంటు భూమి చాలదన్నారు. మూడు సెంట్ల స్థలం కేటాయించాలని ఆయన కోరారు. కార్యక్ర మంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్య దర్శి నందిపోగు రమణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు దండూరి కామేశ్వరరావు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి విజయకుమార్, సీపీఐ నాయ కులు బొమ్ము విజయకుమార్, మన్నేపల్లి శ్రీనివాసులు, పొంగులూరు విజయమ్మ, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నెల్లూరు(క్రైం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ డీసీ టీ శ్రీనివాసరావు సూచించారు. కొత్తూరు ప్రాంతంలోని కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు సోమవారం మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు జీవితాలను నాశనం చేస్తాయని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలపై సమాచారం ఉంటే ఎక్సైజ్, పోలీసు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీ ఏ శ్రీనివాసులునాయుడు, ప్రిన్సిపాల్ కే.శంకరయ్య, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

రేప్ కేసులో నిందితుడి కుటుంబ సభ్యులను అరెస్ట్ చేయాలి

నెల్లూరురూరల్,నవంబరు18(ఆంధ్రజ్యోతి) : నెల్లూరురూరల్ పరిధిలోని పాతమిట్టపాళెంలో ఇటీవల బాలికపై లైంగికదాడికి పాల్పడిన గోడ పెంచలయ్యను అరెస్ట్ చేసిన రూరల్ పోలీసులు అతని పై పోక్సో చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇతన్ని రెండు రోజుల క్రితమే రిమాండ్‌కు తరలించారు. కానీ సదరు బాలిక తండ్రి సోమవారం సోషల్ మీడియా, పలు మీడియా చానల్లో మాట్లాడుతూ తమ కుమార్తెపై లైంగికదాడికి పాల్పడిన పెంచలయ్యకు అతని తల్లి కూడా సహకరించిందని, ఆమెపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెంచలయ్య ఒక్కడినే నిందితుడిగా చేర్చడం తమకు న్యాయం చేకూరదని, వాపోయారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

న్యూస్ బాక్స్

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

నెల్లూరు(విద్య), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని కొండాయపాళెం నగర పాలక ప్రాథమిక పాఠశాలలో సోమవారం నారాయణ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో దంతవైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ అంజలి కీర్తన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. దంత శుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య విద్యార్థులు లక్ష్మీపల్లవి, దిలీప్ కృష్ణ, సౌజన్య, హర్ష, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు సోమేశ్వరరావు, కిరణ్, విద్యావలంటీర్ రాశి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చేయూత

నెల్లూరు(విద్య), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని దైకస్‌రోడ్డులో ఉన్న వియానీ హోమ్‌కు డాక్టర్ కిషోర్స్ రత్నం మెడికల్ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు చేయూతనందించారు. విద్యాసంస్థల జీఎం రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ ప్రతి ఏడాది నిర్వహించే కమ్యూనిటీ సర్వీస్‌డేలో భాగంగా విద్యార్థులు సేకరించిన నిత్యావసరాలు, దుస్తులను హోమ్‌కు అందచేశామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతికిషోర్, ఏవో తుహీన, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల, హోమ్స్ నిర్వాహకురాలు అన్నపూర్ణ, మ్యాగీటీచర్, జయ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు టీచర్లకు శిక్షణ

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు18: ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు రేబాల సెయింట్ థామస్ స్కూల్లో సోమవారం శిక్షణ ప్రారంభించారు. అయూబ్‌ఖాన్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అపుస్మా స్టేట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ శిక్షణ టీచర్లకు ఎంతో ఉపయోగమన్నారు. కార్యక్రమంలో అపుస్మా నేతలు రామసుబ్బారెడ్డి, మల్లేశ్వరరెడ్డి, మున్నా, చిట్టిబాబు, ప్రసాద్, మంజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థల్లో సోమవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు చదరంగం, వక్తృత్వ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమా లను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా ప్రారంభించారు. ప్రజా సైన్సు వేదిక అధ్యక్షుడు ఎం.సతీష్ కుమార్ పర్యవేక్షించారు.



మొదటి మంగళవారం

స్థానికులకు శ్రీవారి దర్శనం

ప్రతినెలా ప్రత్యేక దర్శనం తిరిగి ప్రారంభించాలని టీటీడీ నిర్ణయం ● వివరాలు వెల్లడించిన చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి, తిరుమల స్థానికులకు గతంలో ప్రతినెలా మొదటి మంగళవారం ప్రత్యేకంగా దర్శనం అవకాశం ఉండేది. ఆ తర్వాత రద్దు చేసిన ఈ విధానాన్ని తిరిగి ప్రారంభించాలని నిర్ణయించాం' అని టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో సోమవారం జరిగిన టీటీడీ ధర్మకర్తల మండలి తొలిసమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ఆ నిర్ణయాలివీ..

● తిరుపతిలో గరుడ వారధిని గతంలో సీఎం చంద్రబాబు హయాంలో పనులు ప్రారంభించారు. దాని పేరును గత ప్రభుత్వం శ్రీనివాససేతుగా మార్చింది. ఈక్రమంలో తిరిగి పాతపేరు గరుడవారధిగానే ఉంచాలని బోర్డు తీర్మానించింది.

● గతంలో అలిపిరిలోని 20 ఎకరాలను టూరిజంకు కేటాయించారు. అక్కడ దేవలోకం అనే ప్రాజెక్టును సీఎం చంద్రబాబు ప్రారంభించారు. కానీ ఆ స్థలం కొన్ని చేతులు మారి ముంతాజ్ అనే ఫైవ్‌స్టార్ హోటల్ నిర్మించేందుకు ప్రయత్నాలు జరిగాయి. స్వామి కొండలకు దగ్గరగా ఉన్న ఆ ప్రాంతంలో హోటల్ నిర్మాణం జరిగితే హిందువుల మనోభావాలు దెబ్బతింటాయి. అందుకని ఆ స్థలాన్ని టీటీడీకి అప్పగించాలని ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయించారు.

● బ్రహ్మోత్సవాల్లో విశేష సేవలు అందించిన ఉద్యోగులకు గతేడాది ఇచ్చిన బ్రహ్మోత్సవ బహుమానాన్ని 10 శాతం పెంచాలని నిర్ణయించారు. దీంతో శాశ్వత ఉద్యోగులకు రూ.15,400, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.7,535 బ్రహ్మోత్సవ బహుమానం అందనుంది.

● వివిధ రాష్ట్రాలకు ఇస్తున్న టూరిజం టికెట్లలో అక్రమాలు జరిగాయని విజిలెన్స్ విచారణలో కూడా తేలింది. ఈ క్రమంలో కోటా మొత్తాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తిరుమల పిల్‌గ్రీం సెంటర్ అని, టూరిజం సెంటర్ కాదని పేర్కొన్నారు.

● విమానాశ్రయంలో జారీ చేసే శ్రీవాణి టిక్కెట్ల కోటాను వంద నుంచి 200కు పెంచుతూ తీర్మానించారు.

● నెయ్యి నాణ్యతను పూర్తిస్థాయిలో పరీక్షించేందుకు తిరుమలలో రూ.90 లక్షలతో నూతన ల్యాబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఓ ప్రశ్నకు చైర్మన్ బీఆర్ నాయుడు బదులిచ్చారు. తిరుమలలో అన్యమత ప్రచారం లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

● వీఐపీ బ్రేక్ దర్శనాల సమయాన్ని తగ్గించడం, సమయం మార్పు అంశంపైనా పరిశీలిస్తామన్నారు. ఆలిండియా రేడియోలో శ్రీవారి ఆర్జితసేవల ప్రసారాలను తిరిగి ప్రారంభించే విషయాన్ని అధికారులతో చర్చిస్తామన్నారు.

● ఏఐ టెక్నాలజీ ఉపయోగించి భక్తులకు దర్శన సమయాన్ని తగ్గించేందుకు కొన్ని సంస్థలతో మాట్లాడుతున్నట్టు టీటీడీ ఈవో శ్యామలరావు వివరించారు. రానున్న 25 ఏళ్ల పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నప్రసాద భవనాన్ని ఆధునికీకరిస్తామన్నారు. దీని కోసం టీపీఎస్ అనే సంస్థ ముందుకు వచ్చినట్టు వెల్లడించారు. వడ్డించడం నుంచి పరిశుభ్రత, స్టోర్ వంటి అన్నింట్లో మార్పులు చేస్తామన్నారు.



టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో పాల్గొన్న చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, సభ్యులు

ఆ మఠాలపై చర్యలు తీసుకోండి : కిరణ్

తిరుమలలో భక్తులను దోపిడీ చేస్తున్న మఠాలపై చర్యలు తీసుకోవాలంటూ తిరుపతి జనసేన పార్టీ నేత కిరణ్‌రాయల్ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి వినతిపత్రాన్ని అందజేశారు. తిరుమలలోని 60 శాతం మఠాలు వైసీపీ నేతల చేతుల్లోకి వెళ్లడంతో, వారు సిండికేట్‌గా మారి భక్తులను నిలువుదోపిడి చేస్తున్నారన్నారు. మఠాలను ఫైవ్‌స్టార్ హోటళ్లుగా మార్చి లక్షలాది రూపాయాలు దోచుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. దీంతో సామాన్య భక్తులు తిరుమలలో వివాహాలు చేసుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కొందరు స్వామీజీల అక్రమ కట్టడాలనూ కూల్చేయాలని చైర్మన్‌ను కోరినట్టు తెలిపారు. టూరిజం పేరుతో శ్రీవారి దర్శనాల్లో అక్రమాలు జరుగుతున్నట్టు గతంలో కిరణ్‌రాయల్ వెలుగులోకి తీసుకొచ్చారు. ఈక్రమంలో టూరిజం టికెట్ల కోటాను రద్దు చేస్తూ తీర్మానించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

పాపం పురుషుడు!

● పెరుగుతున్న బలవన్మరణాలు

నేడు ప్రపంచ పురుషుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం 6వ పేజీలో

సత్యాత్మతీర్థ స్వామికి తిరుమలలో పెద్దమర్యాద

తిరుమల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాది మఠాధిపతి సత్యాత్మతీర్థ స్వామిజీ సోమవారం టీటీడీ పెద్ద మర్యాదతో శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో అఖిలాండం వద్దకు చేరుకున్న స్వామిజీకి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చక బృందం శఠగోపాన్ని అందించి ఇస్తికాఫల్ స్వాగతం పలికారు. శిష్య బృందంతో కలిసి ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు.



అఖిలాండం వద్ద సత్యాత్మతీర్థ స్వామికి శఠగోపంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

తిరుపతి(ఆటోనగర్) నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని సదరన్ డిస్కం ఎస్ఈ ఎ.శ్రీనివాస బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సదరన్ డిస్కం పరిధిలో విద్యుత్ చౌర్యం జరుగుతోందని వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇంటి సర్వీసుల రూపంలో కనెక్షన్ తీసుకుని ఇతర సేవలకు వినియోగిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని తెలిపారు. సర్వీసు తీసుకునే సమయంలో అంగీకరించిన నిబంధనలు ఉల్లంఘించరాదని పేర్కొన్నారు.

నేటి నుంచి సీపీటీ పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు ఏపీపీఎస్సీ కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్టు (సీపీటీ) పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. సీపీటీ పరీక్షలపై కలెక్టరేట్‌లో ఆయన సంబంధిత అధికారులతో సమీక్షించారు. పుత్తూరులోని వెంకటేశ పెరుమాల్ కాలేజ్‌లో పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. జిల్లా నుంచి 677మంది అభ్యర్థులు హాజరుకానున్నారని వెల్లడించారు. సమావేశంలో సంబంధిత అధికారులు సురేష్‌బాబు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు

తిరుమల, నవంబరు18(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం శనివారం నాడు రూ.3.87 కోట్లు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను ఆదివారం పరకామణి లెక్కింపులో లెక్కించారు. ఇక, ఆదివారం 71,441 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 23,595 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

ఖేల్ ప్రోత్సాహ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(క్రీడలు), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖేల్ ప్రోత్సాహ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందించే అత్యున్నత ధ్యాన్‌చంద్, ఖేల్‌రత్న, అర్జున, ద్రోణాచార్యలతో పాటు రాష్ట్ర ఖేల్ ప్రోత్సాహ అవార్డులను ప్రకటించారని, అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9542034270ను సంప్రదించాలని కోరారు.

బదిలీ చేసినా రిలీవ్ కాలేదు

తిరుపతి(ఆటోనగర్) నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ సర్కిల్ (ఉమ్మడి చిత్తూరు జిల్లా)లో నూతనంగా ఏర్పడిన చిత్తూరు, అన్నమయ్య జిల్లా కేంద్ర సర్కిల్ కార్యాలయాలకు బదిలీ చేసిన ఉద్యోగులు గడువు ముగిసింది. అయినా, సోమవారం వరకు రిలీవ్ కాకపోవడం విమర్శలకు తావిస్తోంది. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు నూతన జిల్లాల వారీగా విద్యుత్ సర్కిల్ కేంద్రాలు ఏర్పాటు చేసి, గతనెల 22వ తేదీ నూతన సర్కిళ్లను ఏర్పాటు చేయడానికి కార్యాలయ కేంద్రాలు గుర్తించి ఉద్యోగుల బదిలీలు ప్రారంభించారు. బదిలీ చేసిన ఉద్యోగులు ఈనెల 15లోపు రిలీవ్ కావాలని ఆదేశించారు. కానీ, ఏఈ నుంచి జేఎల్ఎం వరకు కొందరు ఉద్యోగులు రిలీవ్ కాలేదు. జిల్లా స్థాయి అధికారి అండదండలతో ఇక్కడే ఉండే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కాగా, కొత్త సర్కిళ్ల కార్యాలయాల్లో నవంబరు ఒకటి నుంచే విధులు నిర్వర్తించాల్సి ఉన్నా, ఇంకా వీరు డ్యూటీల్లో చేరకపోవడం గమనార్హం.



నారావారిపల్లె నుంచి తిరుగు ప్రయాణమైన సీఎం చంద్రబాబు

నారావారిపల్లె నుంచి సీఎం తిరుగు పయనం

● చంద్రబాబును కలిసిన సన్నిహిత బంధువులు, జిల్లా నేతలు

తిరుపతి/చంద్రగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెలో ఆదివారం తన తమ్ముడు రామ్మూర్తినాయుడి అంత్యక్రియల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు.. సోమవారం స్వగృహంలో తలుగు పెట్టారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో మరోసారి సోదరుడి చితి స్థలం వద్దకు వెళ్లి నివాళులర్పించారు. అనారోగ్యంతో మృతి చెందిన సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు అంత్యక్రియలకు ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి చంద్రబాబు స్వగ్రామం వచ్చిన సంగతి తెలిసిందే. ఆదివారం సాయంత్రం లోకేశ్ సతీమణి బ్రాహ్మణి హైదరాబాదు వెళ్లగా.. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, భువనేశ్వరి, దేవాన్ష్ మాత్రం గ్రామంలోనే రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబును గ్రామంలోని సన్నిహిత బంధువులు, జిల్లా టీడీపీ నేతలు, అధికారులు కలిశారు. సోమవారం ఇంట్లో రామ్మూర్తి నాయుడికి తలుగు (బట్టలు, సాంబ్రాణి పెట్టి పూజించడం) పెట్టారు. అనంతరం సన్నిహిత బంధువులు వీరిని కలిశారు. ఆ తర్వాత ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తి నానీ, బొజ్జల సుధీర్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, శాప్ చైర్మన్ రవి నాయుడు, తిరుపతి, చిత్తూరు టీడీపీ పార్లమెంటు కమిటీల అధ్యక్షులు నరసింహ యాదవ్, సీఆర్ రాజన్, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, పార్టీ నేతలు డాలర్స్ దివాకర్‌రెడ్డి, నరసింహ ప్రసాద్, పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగాప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి కమిషనర్ మౌర్య, ఆర్డీవో రామ్మోహన్ తదితరులు చంద్రబాబు, లోకేశ్‌ను కలిశారు. నేతలతో కలిసి మధ్యాహ్నం చంద్రబాబు భోజనం చేశారు.

తమ్ముడికి నివాళులర్పించి..

మధ్యాహ్న భోజనానంతరం లోకేశ్ తనయుడు దేవాన్ష్ హైదరాబాదు బయల్దేరి వెళ్లగా 3.20 గంటలకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ విజయవాడ బయల్దేరారు. మంత్రి లోకేశ్ తన కాన్వాయ్‌తో నేరుగా విమానాశ్రయం వెళ్లగా.. సీఎం చంద్రబాబు మాత్రం తమ మామిడి తోట వద్ద వాహనం ఆపించి కిందకు దిగారు. తోటలోకి వెళ్లి తమ్ముడి దహన క్రియలు జరిగిన ప్రదేశం వద్దకు చేరుకుని నివాళులు అర్పించారు. అనంతరం వెనుదిరిగి విమానాశ్రయం బయల్దేరారు. సాయంత్రం 4 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచీ ప్రత్యేక విమానంలో మంత్రి లోకేశ్‌తో కలసి విజయవాడ బయల్దేరి వెళ్లారు. వారికి కలెక్టర్ వెంకటేశ్వర్, డీఐజీ షిమోషీ బాజ్‌పాయ్, మాజీ మంత్రి అమరనాథరెడ్డి, చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు పులివర్తి నానీ, బొజ్జల సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ నేత కొల్లారు ఇందుశేఖర్ తదితరులు వీడ్కోలు పలికారు.



మంత్రి లోకేశ్‌తో టీడీపీ నేతలు

28న కర్మక్రియలు.. హాజరు కానున్న సీఎం

రామ్మూర్తినాయుడి కర్మక్రియలు ఈనెల 28వ తేదీన నిర్వహించనున్నారు. ఆ రోజు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఉదయం వచ్చి కార్యక్రమంలో పాల్గొని అదే రోజు సాయంత్రం తిరిగి విజయవాడ వెళ్లనున్నారు. కర్మక్రియల ఏర్పాట్లకు సంబంధించి ఆ రోజున భోజనాలు ఏర్పాటు చేయడానికి, వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాలను సీఎం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ, ఎస్పీ సుబ్బరాయుడు పరిశీలించారు. సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి రామ్మూర్తినాయుడు కుటుంబీకులతో కలసి ఈనెల 28వ తేదీ వరకు నారావారిపల్లిలోనే ఉండనున్నారు.



కర్మక్రియలకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాని, అధికారులు

సీఎం ఇంటి ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

సోమవారం మధ్యాహ్నం సీఎం చంద్రబాబును కలిసేందుకు తిరుపతి పద్మావతి వర్సిటీ సమీపంలోని గాంధీనగర్ నుంచి యశోద నారావారిపల్లికి వచ్చారు. చాలాసేపు సీఎం నివాసం ఎదుట నిరీక్షించారు. పోలీసులు అనుమతించకపోవడంతో బలవంతంగా లోపలకు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆమె చేతికున్న గాజులు పగులగొట్టుకుని ఆ ముక్కలు, పొడి మింగి ఆత్మహత్యకు యత్నించారు. పోలీసులు అడ్డుకుని ఆమెను అదుపులోకి తీసుకుని చంద్రగిరి పోలీసు స్టేషన్‌కు తరలించి.. అనంతరం విడిచిపెట్టారు. ఈ ఘటనను ఫొటోలు, వీడియోలు తీయడానికి యత్నించిన మీడియా ప్రతినిధుల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారు. ఆంధ్రజ్యోతి విలేకరి నుంచీ మొబైల్ ఫోన్ గుంజుకున్నారు.



మహిళ నోట్లో నుంచి గాజులు తీస్తున్న పోలీసులు

తిరుపతిలో కార్తీక దీపోత్సవం



తిరుపతి(కల్చరల్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం మైదానంలో సోమవారం సాయంత్రం కార్తీక దీపోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి స్వామి మాట్లాడుతూ.. కార్తీక మాసంలో దైవ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల అధిక ఫలం పొందవచ్చన్నారు. మనలోని అంధకారాన్ని దీపం పోగొడుతుందన్నారు. శివకేశవుల వైశిష్ట్యం, దీపం ప్రాముఖ్యత, దీపారాధనతో కలిగే ప్రయోజనాన్ని వివరించారు. ప్రజల హృదయాలలో జ్ఞానజ్యోతులు వెలిగించాలని వేంకటేశ్వర స్వామిని కోరుకుంటున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఎస్వీ వేదవిశ్వవిద్యాలయం వేద పండితులు యతివందనం, వేద స్వస్తి నిర్వహించారు. వివిధ పూజల అనంతరం ఎస్వీ సంగీత నృత్య కళాశాల విద్యార్థులు నృత్య రూపకం ప్రదర్శించారు. చివరగా అన్నమాచార్య ప్రాజక్టు కళాకారులు అన్నమయ్య గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో జె.శ్యామల రావు, వేద వర్సిటీ వీసీ ఆచార్య రాణి సదాశివ మూర్తి, బోర్డు సభ్యులు జంగా కృష్ణ మూర్తి, భానుప్రకాష్ రెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, డీఎల్వో వరప్రసాదరావు, తిరుమల ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, కృష్ణ శేషాచల దీక్షితులు, అర్చక బృందం, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సిద్ధేశ్వరానందభారతి



శైవాలయాల్లో 'కార్తీక' సందడి



శ్రీకాళహస్తిలోని భరద్వాజతీర్థంలో కార్తీక దీపాల వెలుగులు.. దీపం వెలిగిస్తున్న ఈవో బాపిరెడ్డి

కార్తీక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని శైవ ఆలయాల్లో శివనామస్మరణ మార్మోగింది. జిల్లాలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. సాయంత్రం దీపాలు వెలిగించారు.





కపిలతీర్థంలో భక్తుల సందడి





నేడు ప్రపంచ పురుషుల దినోత్సవం

పాపం.. పురుషుడు!

పెరుగుతున్న బలవన్మరణాలు



"అమ్మ తొమ్మిది నెలలు మోస్తే నాన్న పాతికేళ్లు.. రెండూ సమానమే అయినా నాన్న ఎందుకో వెనుకబడ్డాడు. ఇంట్లో జీతం తీసుకోకుండా అమ్మ..తన జీతమంతా ఇంటికే ఖర్చుపెట్టే నాన్న .. ఇద్దరి శ్రమ సమానమే అయినా నాన్న ఎందుకో వెనుకబడ్డాడు.."


ఇటీవల సోషల్ మీడియాలో బాగా వైరల్ అయిన కవిత ఇది. చిన జీయర్ స్వామి సమక్షంలో రచయిత, సినీనటుడు ఈ కవిత చదువుతూ భావోద్వేగాన్ని అదుపు చేసుకోలేకపోయారు. అందరూ అమ్మ గురించో లేదా మహిళల కష్టం గురించో మాట్లాడుతారు. బండెడు సంసార భారం మోస్తూ ఏనాడూ తన ఆరోగ్యం గురించి పట్టించుకోని నాన్నను విస్మరిస్తారు. కారణం అతడు పురుషుడు. సంసారనావ ఈదుతూ ఎదురయ్యే ఒత్తిళ్లు, ఆర్థిక సవాళ్లను మగవాళ్లు నిశ్శబ్దంగా భరిస్తున్నారు. ఒక్కోసారి తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడుతుంటారు. సామాజిక, కుటుంబ, వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యలను పరిష్కారాలుగా ఎంచుకుంటున్నారని జిల్లా గణాంకాలు చెబుతున్నాయి.

- తిరుపతి(ఆంధ్రజ్యోతి)

"పురుషుల మానసికారోగ్యం, ప్రాముఖ్యత గురించి చర్చ జరగాలనే ఆలోచనతో 'పాజిటివ్ మేల్ రోల్ మోడల్స్' అనే నినాదంతో నవంబరు 19ని ప్రపంచ పురుషుల దినోత్సవంగా గుర్తిస్తున్నారు."

తిరుపతి జిల్లాలో పురుషుల ఆత్మహత్యల సంఖ్య మహిళలకంటే చాలా ఎక్కువగా ఉంది. ప్రతి 10 ఆత్మహత్యల్లో ఏడు లేదా ఎనిమిది మంది పురుషులే ఉన్నారు. గతేడాది 339 మంది ఆత్మహత్యలకు పాల్పడితే వారిలో 272 మంది పురుషులు ఉన్నారు. ఈఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకూ గణాంకాలు పరిశీలిస్తే ఆత్మహత్య చేసుకున్న వారిలో మగవాళ్లు మహిళల కన్నా మూడు రెట్లు ఎక్కువ ఉన్నారు. గడిచిన 10 నెలల్లో 365 మంది ఆత్మహత్య చేసుకుంటే వీరిలో 283 మంది పురుషులే. ఆత్మహత్యకు భిన్నా కారణాలున్నా, ఒత్తిడికి గురవడం ప్రధానమని మానసిన వైద్య నిపుణులు చెబుతున్నారు. కుటుంబ సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధుల వల్ల కూడా కొందరు విషాదాంతమవుతున్నారు. ఒత్తిళ్ల తీవ్రత వల్లనే చాలామంది పురుషులు బీపీ, షుగర్‌ల బారిన పడుతున్నారు.

మద్యానికి బానిసలై



జిల్లాలో పది లక్షలమందికి పైగా పురుషులు ఉన్నారు. వీరిలో ప్రతి పదిమందిలో నలుగురు ఆల్కహాలును ఆశ్రయిసున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఇందుకు కారణం ఒత్తిడి అని వీరు చెబుతుంటారు. జిల్లాలో నాలుగు డీ-అడిక్షన్ సెంటర్లు ఉన్నారు. ఇందులో ఒకటి రుయా ఆస్పత్రిలో నడుస్తోంది. మూడేళ్ల క్రితం తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో లక్ష్మీపురం వద్ద మరొకటి ఏర్పాటైంది. రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఒకటి, పాపానాయుడు పేటలో మరొక డీ అడిక్షన్ సెంటర్ నడుస్తోంది. ఇక్కడ మద్యానికి బానిసలైన వారికి కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

పురుషులే ఎందుకు?



శారీరకంగా పురుషుడు, స్త్రీకన్నా బలం కలిగినవాడు అనే వాదన వినిపిస్తుంటుంది. కార్మికుల వేతనాల్లోనూ ఈ తేడా చూపిస్తుంటారు. పిల్లల్ని కనే శక్తి ఉన్న స్త్రీలు సహజంగానే శారీరకంగా బలహీనం కావచ్చు గానీ, మానసికంగా మాత్రం పురుషులకన్నా బలమైనవారు. కుటుంబ, ఆర్థిక, సామాజిక సంక్షోభాలను ఎదుర్కొనే స్థైర్యం మహిళల్లోనే ఎక్కువ. పిల్లలు, కుటుంబం అనే బాధ్యత కూడా వీరికి పోరాడే తెగువను ఇస్తుంది. మగవాళ్లు చావును ఎంచుకుని తేలిగ్గా ఈ బాధ్యతల నుంచి పారిపోయే ప్రయత్నం చేస్తారు. అందుకే ఆనారోగ్యంతోనే, అప్పులతోనే ఆత్మహత్యలకు పాల్పడ్డారంటూ పురుషుల గురించే ఎక్కువగా వింటుంటాం.

పురుషులు బయటకు చెప్పుకోలేరు



రకరకాల ఒత్తిళ్ల వల్ల పురుషులు మానసికంగా అంతకంతకూ బలహీనులవుతున్నారు. అందుకే మహిళల కన్నా పురుషుల్లోనే ఆత్మహత్యలు మూడు రెట్లు ఎక్కువ కనిపిస్తున్నాయి. మానసిక బలహీనతలతో పాటు బీపీ, డయాబెటిస్, గుండె జబ్బులు తదితర అరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. పురుషులు ఒత్తిడిని బయటకు చెప్పుకోలేరు. మనసులోనే దాచుకుని నలిగిపోతుంటారు. ఆడవాళ్లతో పోలిస్తే మగాళ్లకే గుండెపోటు ఎక్కువగా వస్తుందని పలు పరిశోధనల్లో తేలింది. ఇండియన్ హార్ట్ సొసైటీ ప్రకారం..గుండెపోటు వచ్చిన 50 శాతం మగాళ్లలో 50 ఏళ్ల కంటే తక్కువ వయసున్న వాళ్లే ఉన్నారు. విదేశీయులతో పోల్చితే మన దేశంలో ఉన్న మగాళ్లే రెండు రెట్లు ఎక్కువగా గుండె సంబంధిత జబ్బులతో బాధపడుతున్నారు.

- అనుపమ, క్లినికల్ సైకాలజిస్టు

అర్జీలను సకాలంలో పరిష్కరించండి

● కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 168 వినతులు

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 168 వినతులు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖకు 109 ఉన్నాయి. పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి సమస్యనూ సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని జేసీ అధికారులను ఆదేశించారు. డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ దేవేంద్రరెడ్డి ఇతర అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

పింఛను కోసం 8 నెలలుగా తిరుగుతున్నా..



'కూలి పనులు చేసుకుని బతుకుతున్నాం. షుగర్ వ్యాధితో రెండు కాళ్లు తొలగించారు. కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్నా. పింఛను కోసం ఎనిమిది నెలలుగా తిరుగుతున్నా. ఎవరూ పట్టించుకోవడం లేదు. మీరైనా పట్టించుకోండి' అంటూ రేణిగుంట పాంచాలినగర్‌కు చెందిన శంకరయ్య అధికారులకు విన్నవించారు.

నిమ్మచెట్లు నరికేశారు



అయ్యా నేను, నా భార్య దివ్యాంగులం. నాకు బాలయ్యపల్లి మండలం అష్టకావేరి గ్రామంలో ఎకరా భూమి ఉంది. 25ఏళ్లుగా సాగుచేసుకుంటున్నాం. గ్రామానికి చెందిన వీరయ్య నా పొలాన్ని నాలుగు నెలల క్రితం ఆక్రమించుకున్నారు. దీనిపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. అయితే పొలంలో ఉన్న నిమ్మచెట్లను సదరు వ్యక్తులు నరికేశారు. న్యాయం చేయాలని వెంకటరమణయ్య అధికారులకు విన్నవించారు.

నష్ట పరిహారం ఇవ్వండి

గాలేరు - నగరి సుజల స్రవంతి పథకం కోసం ఏర్పేడు వద్ద ఉన్న మా భూమిని అధికారులు తీసుకున్నారు. పరిహారం కోసం మూడేళ్లగా జీఎన్ఎస్ఎస్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా చెల్లించడంలేదు. కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా అదే పరిస్థితి. న్యాయం చేయాలని తిరుపతికి చెందిన మొబీనాబేగం అధికారులకు విన్నవించారు.

జీవో అమలు చేయాలని ఆందోళన

ఆశా వర్కర్ల సమస్యలపై ప్రభుత్వంతో కుదుర్చుకున్న జీవోను తక్షణం అమలు చేయాలని కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, జిల్లా కార్యదర్శి జయచంద్ర మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలపై చర్చలు జరిపి జీవో విడుదలై తొమ్మిది నెలలు కావస్తున్నా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత, ప్రధాన కార్యదర్శిలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు బీమా సౌకర్యం కల్పించాలని, పనిభారం తగ్గించాలని, ఉద్యోగ విరమణ చెందిన వారికి బెనిఫిట్ స్కీమ్ కింద తక్షణమే రూ.60వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



వేతనం పెంచాలని ధర్నా



కనీస వేతనాలు పెంచాలని కోరుతూ సివిల్ సప్లైస్ కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. సంఘీభావం ప్రకటించిన సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ పెరిగిన ధరలకనుగుణంగా కూలి రేట్లు పెంచాలని కోరారు. ప్రతినెలా ఐదో తేదీన జీతాలు చెల్లించాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నగర కార్యదర్శి రవి, హమాలీ యూనియన్ నాయకులు చెంచయ్య, శీను, పాండు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం





ఘటనా స్థలంలో ద్విచక్ర వాహనం - ప్రసాద్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని బియ్యం లారీ ఢీకొన్న ఘటనలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని వీఎంపల్లి వద్ద నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగింది. వెంకటగిరి మండలం చిన్నపరెడ్డిపల్లికి చెందిన ప్రసాద్‌రెడ్డి(37) ఎరువుల కంపెనీలో మార్కెటింగ్ ఉద్యోగి. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై సోమవారం సాయంత్రం శ్రీకాళహస్తి టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఓ ఎరువుల దుకాణం వద్దకు వచ్చాడు. అక్కడ కార్యకలాపాలు ముగించుకుని తిరిగి ఇంటికి బయలుదేరాడు. కాసాగార్డెన్ వద్ద సర్వీసు రోడ్డు నుంచి వెంకటగిరికి బయలుదేరాడు. వీఎంపల్లి వద్ద జాతీయ రహదారి మెయిన్‌రోడ్డులోకి ప్రవేశించే క్రమంలో నెల్లూరు నుంచి బెంగళూరుకు వెళుతున్న బియ్యంలోడ్ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ప్రసాద్‌రెడ్డి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. 2వ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా 90 రోజుల సుదీర్ఘకాలం ప్రసాద్‌రెడ్డి అయ్యప్పదీక్షలో ఉన్నాడు.

రేణిగుంటలో నాలుగు ఆర్ఎంపీ క్లినిక్‌లు, రెండు మెడికల్ షాపుల సీజ్



సాయినారాయణ ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

రేణిగుంట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాలుగు ఆర్ఎంపీ క్లినిక్‌లను, రెండు మెడికల్ షాపులను జిల్లా వైద్యాధికారి శ్రీహరి సీజ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని వీబీఆర్ నర్సింగ్ కళాశాలలో కలుషిత ఆహారం తిని ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో వారిని జిల్లా వైద్యాధికారి శ్రీహరి పరీక్షించారు. ఈ సందర్భంగా వీబీఆర్ నర్సింగ్ కళాశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రేణిగుంట పట్టణంలోని ఆర్ఎంపీ క్లినిక్‌లపై ఫిర్యాదు రావడంతో ఆయన వాటని తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సాయి నారాయణ, కార్తికేయ, శ్రీపద్మావతి వెంకటేశ్వర, రూప క్లినిక్‌లను, సాయి నారాయణ, శ్రీపద్మావతి వెంకటేశ్వర క్లినిక్‌లకు అనుబంధంగా ఉన్న మెడికల్ షాప్‌లను సీజ్ చేశారు. మండలంలోని ఆర్ఎంపీ క్లినిక్‌లను తనిఖీ చేయాలని వైద్యాధికారి చత్ర ప్రకాష్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేశారు.

జగన్‌పై అసభ్యకరపోస్టులు పెట్టారు

● తిరుపతి పోలీసులకు భూమన, రోజా, నారాయణస్వామి ఫిర్యాదు



తిరుపతి ఈస్ట్ ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న వైసీపీ నాయకులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పార్టీల మధ్య, కులాల మధ్య చిచ్చుపెడుతూ తమ నాయకుడు వైఎస్ జగన్‌పై అసభ్యరక పోస్టులు పెడుతున్న వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మాజీ మంత్రి రోజా, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష తిరుపతి ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నరసింహులు ఫిర్యాదును పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని వారికి చెప్పారు. వైసీపీ నాయకులు కోరినట్లుగా ఫిర్యాదుకు రసీదు ఇచ్చారు. వైసీపీని భ్రష్టు పట్టించాలనే ఆలోచనతోనే తప్పుడు పోస్టులు పెడుతున్నారని భూమన కరుణాకరరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఆరోపించారు. తమ ఆత్మాభిమానం దెబ్బతీసేలా పోస్టులు పెట్టిన వారిపై తక్షణం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలీసులపై ప్రివిలేజ్ మోషన్: ఎంపీ

ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు తీసుకోవడానికి పోలీసులు ఆసక్తి చూపలేదని తిరుపతి ఎంపీ గురుమూర్తి ఆరోపించారు. దాదాపు 40 నిమిషాల పాటు పట్టించుకోలేదన్నారు. ప్రొటోకాల్ పాటించని పోలీసులపై ప్రివిలేజ్‌మోషన్ మూవ్ చేయాల్సి వుంటుందని హెచ్చరించారు.

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

● జాతీయ మానవ హక్కుల కమిషన్ ఛైర్‌పర్సన్ విజయభారతి



సమావేశంలో పాల్గొన్న జాతీయ మానవ హక్కుల కమిషన్ అధికారులతో ఐఐటీ విద్యార్థులు, అధ్యాపకులు

ఏర్పేడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యావంతులు మహిళల భద్రత పట్ల శ్రద్ధ చూపాలని, మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతగా భావించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ ఛైర్‌పర్సన్ విజయభారతి స్పష్టం చేశారు. తిరుపతి ఐఐటీలో నీతి బోధ్ క్లబ్, నేషనల్ సర్వీస్ స్కీం సహకారంతో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి సామాజిక సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ ఇన్వెష్టిగేషన్ డైరెక్టర్ అజయ్ భట్నాగర్ మాట్లాడుతూ... సమాజాన్ని చైతన్యవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. మహిళల భద్రత పెంపొందించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ... ఇలాంటి కీలకమైన కార్యక్రమాన్ని నిర్వహించడంలో నీతిబోధ్ క్లబ్, ఎన్ఎస్ఎస్ టీంల సమిష్టి కృషి ఉందన్నారు. మహిళల హక్కులు, ఆహార భద్రత, పౌష్టికాహారంపై విజయభారతి సయాని పలు సూచనలు చేశారు. మహిళల శ్రేయస్సు, సాధికారతకు ఆచరించాల్సిన విధి విధానాలపై ప్రసంగించారు. ఐఐటీలో విశిష్ట ఉపన్యాస కార్యక్రమం సామాజిక బాధ్యత పెంపొందించే విధంగా నిర్వహించడం పట్ల జాతీయ మానవ హక్కుల కమిషన్ అధికారులకు ఐఐటీ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

పేర్నాడు రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి

● అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పులికాట్ సరస్సులో పర్యావరణం దెబ్బతింటుందన్న ఉద్దేశంతో సూళ్లూరుపేట మండలం పేర్నాడు రోడ్డుకు అటవీ అనుమతులు ఇవ్వడం లేదని ప్రభుత్వం కల్పించుకొని అనుమతులు ఇప్పించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అసెంబ్లీలో ప్రస్తావించారు. సోమవారం శాసనసభ జీరో అవర్‌లో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో వేనాడు-పేర్నాడు రోడ్డు సమస్యను ఆమె ప్రస్తావించారు. మూడు పంచాయతీల పరిధిలో 18 గ్రామాలు ఉన్నాయని సుమారు 5వేల మంది ఆయా గ్రామాల్లో జీవిస్తున్నార న్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు సరైన రోడ్డు వసతిని ఆ గ్రామాల్లో ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. సరస్సు కోసం వచ్చే వలస పక్షులు ఎంత ముఖ్యమో ఆయా గ్రామాల ప్రజలు కూడా అంతే ముఖ్యమని తెలియజేశారు. ఆ మేరకు ఆ రోడ్డు ఏర్పాటుకు అడ్డంకులు సృష్టిస్తున్న అటవీశాఖ నుంచి అనుమతులు ఇప్పించాలని కోరారు.

ఎర్రచందనం వాహన డ్రైవరు అరెస్టు

● టాస్క్‌ఫోర్సు కానిస్టేబుల్‌పై హత్యాయత్నం కేసులో నిందితుడు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం చింతలపాలెం చెక్‌పోస్టు వద్ద పది నెలల కిందట టాస్క్‌ఫోర్సు కానిస్టేబుల్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడు.. ఎర్రచందనం స్మగ్లింగ్ వాహన డ్రైవర్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపిన ప్రకారం.. చింతలపాలెం చెక్‌పోస్టు వద్ద ఈ ఏడాది ఫిబ్రవరి 23న తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు పోలీసులు వాహనాలను తనిఖీ తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో ఎర్రచందనం తీసుకుని వస్తున్న కారును కానిస్టేబుళ్లు ఆపారు. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరుకు చెందిన వసంత్ ఎర్రచందనం వాహనం ఆపకుండా వేగంగా వచ్చి కానిస్టేబుల్ ప్రభాకరరావును ఢీకొట్టి పరారయ్యాడు. దీనిపై ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడైన వసంత్ కోసం గాలించిన పోలీసులు.. సోమవారం అరెస్టు చేశారు. అతడిని విచారించి ఈ కేసులో ప్రధాన స్మగ్లర్ ఎవరనే విషయాలు నమోదు చేసి రిమాండుకు తరలించామని ఏర్పేడు సీఐ జయచంద్ర చెప్పారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని భక్తుల రద్దీ నెలకొంది. సూర్యోదయానికి ముందే ఆలయం వద్ద భక్తుల సందడి అధికంగా కనిపించింది. స్వర్ణముఖి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. రెండవ గేటు సమీపంలో భక్తులు కార్తీక సోమవారం సందర్భంగా విశేషంగా దీపారాధన సమర్పించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో అధికారులు అందుకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకున్నారు. రూ.50 శీఘ్ర దర్శనం 3,328, రూ.200 ప్రత్యేక ప్రవేశదర్శనం 3,102 కలిపి మొత్తం 6,430 టిక్కెట్లు అమ్ముడైనట్లు అధికారులుపేర్కొన్నారు. మొత్తంగా 35వేలమంది భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.

వేడుకగా అయ్యప్ప పూజ

సూళ్లూరుపేట, నవంబరు18 (ఆంధ్ర జ్యోతి): సూళ్లూరుపేటలోని బాపూజీ వీధిలో సోమవారం అయ్యప్ప స్వామి పూజ ఘనంగా జరిగింది. ముందుగా గణపతి పూజతో ప్రారంభించి కర్పూర హారతి, 18 పడికట్ల పూజ చేశారు.

పేదలకు నివాస స్థలాలు మంజూరు చేయాలి



సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గూడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని నిరుపేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయాలని సీపీఐ నాయకులు కోరారు. సోమవారం పట్టణంలోని 10వ సచివాల యంలో సచివాలయ సిబ్బందికి సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాల కోసం రూ. 5లక్షలు కేటాయించాలన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని సక్రమంగా అమలు పరచాల న్నారు. ఈ కార్యక్రమంలో కాలేషా, శశికుమార్, చంద్రయ్య, సుబ్రమణ్యం, యాకోబు, అంకయ్య పాల్గొన్నారు.

షాదీ మంజిళ్లకు, మదర్సాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి



మంత్రికి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని షాదీమంజిళ్లకు, మదర్సాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కోరారు. సోమవారం అమరావతిలో రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎండీ ఫరూక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని మైనార్టీల సమస్యలను పరిష్కరించాలన్నారు. కోట పట్టణంలో షాదీమంజిల్‌లో అదనపు గదులు నిర్మించేందుకు, నియోజకవర్గ పరిధిలో వీటిని అభివృద్ధిపరిచేందుకు నిధులు కేటాయించాలని కోరామన్నారు. అదేవిధంగా దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కలిసి నియోజకవర్గ పరిధిలో పలు ఆలయాల్లో పనిచేసే అర్చకులకు గౌరవవేతనాలు అందించాలని, నిరుపయోగంగా ఉన్న ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జలీల్‌అహ్మద్, మోహన్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, మధు, అమరేంద్ర, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

26న చేపట్టే ధర్నాను విజయవంతం చేయండి: సీపీఎం

గూడూరు అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతాంగ, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన తిరుపతిలోని కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు అన్నారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వలన పంటలు దెబ్బతింటున్నాయని పంట రుణమాఫీ బకాయిలను మాఫీ చేయాలన్నారు. రైతులు, వ్యవసాయకార్మికులకు, కౌలురైతులకు పెన్షన్ సదుపాయాన్ని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జోగి శివకుమార్, శంకరయ్య, సురేష్, బీవీరమణయ్య, చంద్రయ్య, ప్రసాద్, వెంకట్రావు పాల్గొన్నారు.

22న ఓజిలి డిపో వద్ద వేలం పాటలు




మాట్లాడుతున్న డిపో మేనేజర్ బాబుశ్రీధర్

గూడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓజిలిలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) డిపో వద్ద ఈనెల 22వ తేదీన ఎక్సైజ్ శాఖకు సంబంధించిన పలు రకాల వస్తువులకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ బాబుశ్రీధర్ అన్నారు. సోమవారం స్థానిక ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మద్యం దుకాణాలను ప్రభుత్వం నిర్వహిం చేద న్నారు. ప్రస్తుత ప్రభుత్వం నూతన మద్యం పాలసీని అమలు చేస్తోందన్నారు. దీంతో గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాలను తొలగించిందని, వాటిలో ఉన్న ఫ్రీజర్లు, ఇన్వర్టర్‌లు, క్యాష్ కౌంటింగ్ మిషన్‌లు, స్కానర్లు, ఇతర వస్తువులకు బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తామని వివరించారు. ఓజిలి డిపో పరిధిలోకి వచ్చే ప్రభుత్వ మద్యం దుకాణాలలోని వస్తువులను వేలంలో విక్రయిస్తామని తెలియజేశారు. వేలంలో పాల్గొనదలచినవారు రూ. 5వేలు ముందస్తు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయం పనివేళల్లో డిపో మేనేజర్‌ను సంప్రదించాలన్నారు. వివ రాలకు 9985362848, 9014749669 ఫోన్‌నంబర్లును సంప్రదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పడిపూజ

గూడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక శారదనగర్‌లోని ఎల్‌ఏపీ పాఠశాలలో సోమవారం శ్రీకాంత్‌రెడ్డి, సుదేష్ణమ్మల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పడి పూజ నిర్వహించారు. వినాయకస్వామి, అయ్యప్ప స్వామి, సుబ్రమణేశ్వరస్వామి, వెంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవిలకు ప్రత్యేక పూజలుచేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

చెరువులకు చేరిన 'గంగ'



అర్లపాడు వద్ద 7వ బ్రాంచి కాలువల ద్వారా ప్రవహిస్తున్న తెలుగుగంగ నీరు, నిండు కుండలా పునబాక చెరువు

పెళ్లకూరు, నవంబరు 18,(ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలో పలు చెరువులకు తెలుగుగంగ నీరుచేరింది. చెరువులు జలకళను సంతరించు కున్నాయి. ఈ ఏడాది సరైన వర్షాలు కురవని నేపథ్యంలో అక్టోబరు 30న తొట్టంబేడు మండలం సింగమాల వద్ద తెలుగుగంగ హెడ్ రెగ్యులేటర్ నుంచి తెలుగుగంగ 7వ బ్రాంచి కాలువలకు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కండలేరు జలాలను విడుదల చేశారు. దీంతో మండలంలోని మొత్తం 75 చిన్నా, పెద్ద చెరువులకు గాను సుమారు 50 చెరువులకు పైగా సాగునీరు సరఫరా అవుతోంది. ప్రస్తుతానికి పునబాక, చెంబేడు, చిల్లకూరు, అర్థమాల, పెళ్లకూరు, శిరసనంబేడు, బంగారంపేట తదితర చెరువులు నిండాయి. దీంతో పాటు పెళ్లకూరు మండలం మీదుగా సమీపంలోని నాయుడుపేట, ఓజిలి, దొరవారిసత్రం, చిట్టమూరు మండలాల పరిధిలోని పలు చెరువులకు తెలుగుంగ నీరు చేరుతోంది. ఆయా గ్రామాల చెరువుల ఆయకట్టు కింద వరి సాగు పనులు ముమ్మరమయ్యాయి.

హామీలు నెరవేర్చాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

వెంకటగిరిటౌన్, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ వెంకటగిరి నియోజకవర్గ కార్యదర్శి పీ.బాలకృష్ణ అన్నారు. సోమవారం 3,5,8 సచివాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో 2సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ప్రభుత్వమే సొంతంగా ఇళ్లు కట్టిస్తామని చెప్పారని అది నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంకయ్య, తులసమ్మ, జయకృష్ణ, అజయ్, సాయి, తిరుమలేష్, సౌరవ్, లోకేష్, గిరి, సరేంద్ర, సాయి పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌పై అవగాహన పెంచాలి

కోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత రబీసీజన్‌లో రైతులకు ఈ-క్రాప్‌పై అవగాహన పెంచాలని మండల వ్యవసాయ అధికారి వంజివాక నిరంజన్‌కుమార్ కోరారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం వ్యవసాయ సహాయకులతో ఈ క్రాప్‌పై సమీక్ష జరిగింది. పంటల వారీగా నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ విస్తరణ అధికారి సాయికుమార్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మృతుడి వివరాలు లభ్యం

వాకాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుగరాజపట్నం పంచాయతీ దర్గా సమీపంలో శనివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన గుర్తుతెలియని యువకుడి వివరాలు సోమవారం వెల్లడయ్యాయి. ఎస్‌ఐ నాగబాబు కథనం మేరకు.. మృతుడు గూడూరు శివాలయం వీధిలోని కొండా ఉదయ్‌కుమార్‌రెడ్డి-కుసుమ దంపతుల కుమారుడు అనిత్‌రెడ్డి (25)గా గుర్తించారు. కాగా తమ కుమారుడి మృతిపై అనుమానం ఉందని సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని మృతుడి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న బిందురెడ్డి

కోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కార్యకర్త గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్ఠత కోసం సైనికుల్లా పనిచేయాలయి బీజేపీ జిల్లా కార్యదర్శి బిందురెడ్డి కోరారు. కోటలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆపార్టీ కార్యకర్తలు, నాయకులతో సమీక్ష నిర్వహించారు. మండల కమిటీని వేయాలంటే క్రియాశీలక సభ్యత్వాల సంఖ్య పెంచాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సారంగం రమేష్‌బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి కోటారెడ్డి, శ్యామలమ్మ, వాసు తదితరులు ఉన్నారు.

గూడలిలో క్యాన్సర్ పరీక్షలు



కోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గూడలి, రాజు పాళెం, దక్షిణపాలెం, ప్రకాశంకాలనీలలో సోమవారం వైద్య సిబ్బంది ఆధ్వ ర్యంలో క్యాన్సర్ పరీక్షలు జరిగాయి. ఏఎన్‌ఎం, ఆశాలు ఇంటింటా తిరిగి క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. రక్తనమూనాలను సేకరించారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

నాయుడుపేట టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న 15 మద్యం బాటిళ్లను ఎక్సైజ్ సీఐ అరుణకుమారి స్వాధీనం చేసుకున్నారు. నాయుడుపేట - మేనకూరు సమీపంలో సోమవారం అదే గ్రామానికి చెందిన మహేష్ అనే యువకుడు అక్రమంగా 15 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా సీఐ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీఐ వెంట ఎస్‌ఐ గంగాధర్, సిబ్బంది ఉన్నారు.

కొళాయిలు లేక..నీరంతా వృథా..!



కాశీపేట పాతమురళీకృష్ణ హోటల్ ఎదురుగా వృథాగా పోతున్న నీరు

వెంకటగిరిటౌన్, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో నీరు వృథాగా పోతోంది. మున్సిపాలిటీ వారు తాగునీటి పైపులైన్లు వేశారు. అయితే ఆ పైపులకు కొళాయిలు ఏర్పాటుచేయలేదు. ఫలితంగా నీరు సరఫరా చేశాక ప్రజలు పట్టుకుంటున్నారు. కొళాయిలు లేకపోవడంతో ఆ తర్వాత నీరంతా వృథాగా పోతోంది. అధికారులు స్పందించి కొళాయిలు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కిటకిటలాడిన ఆలయాలు

వెంకటగిరిటౌన్, నవంబరు 18,(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశీ విశ్వనాధ స్వామి, రామలింగేశ్వర స్వామి, కర్ణకమ్మ వీధిలోని హర హరక్షేత్రం, వల్లివేడు క్రాస్ వద్ద మల్లికార్జున భ్రమరాంబిక ఆల యంలో కార్తీక మాసం మూడవ సోమవారం పురస్కరించుకుని ఆలయాలు మహిళలతో కిక్కిరిసి శాయి. ఉదయం నుంచి శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. ● అదేవిధంగా హర హర క్షేత్రంలో వైసీపీ పట్టణ కన్వీనర్ ఆధ్వర్యంలో డిల్లీబాబు ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు.

గుంతలమయంగా ఏర్పేడు-పెంచలకోన హైవే

● రోడ్డును ఆక్రమించేసిన వ్యాపారులు ● పట్టించుకోని అధికారులు



వెంకటగిరి-రాపూరు దెబ్బతిన్న రోడ్డు

వెంకటగిరిటౌన్, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు పెంచలకోన జాతీయ రహదారి నెం. 565. ఇది ఏర్పేడు- పెంచల కోన వరకు 86 కిలో మీటర్లు ఉంది. ఈ జాతీయ రహదారిని 2017లో ప్రారంభించారు. ఈ రహదారిలో చింతలపాళెం, గుండవోలు వద్ద రెండు టోల్ గేట్లు ఉన్నాయి. రెండు చోట్లా వాహన దారుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారు. అయితే ఈ జాతీయ రహదారి పొడవునా గుంతల మయంగా దర్శనం ఇస్తుంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పశువులతో ప్రమాదాలు.. కుచించుకుపోయిన రోడ్డు

హైవే వెంబడి ఉన్న గ్రామాల్లో పశువులు రోడ్డుపై వదిలి వేస్తున్నారు. ముఖ్యంగా పాలకేంద్రం, వల్లివేడు క్రాస్, కాంపాళెం, మిట్టపాళెం, నాగవోలు, వడ్డిపల్లి, పలుగోడు పశువులు రోడ్డుపై ఉంటు న్నాయి. అవిరోడ్డు వెంబడి మేత మేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో అవి పోట్లాడుకుని అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చేస్తున్నాయి. ఆ సమయంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లు ఉంటున్నాయి. వాటిని కత్తిరించడం లేదు. ఇక రోడ్డుపై సాగించే వ్యాపారులతోనూ వాహనదారులు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రధానంగా రాపూరు క్రాస్ రోడ్డు నుంచి పాలకేంద్రం వరకు 80 అడుగుల రోడ్డు విస్తీర్ణం ఉంది. పాలకేంద్రం నుంచి తారక రామారావు స్టేడియం వరకు 50 అడుగుల రోడ్డుకు పడిపోయింది. దాదాపు 30 అడుగుల రోడ్డును వ్యాపారులు ఆక్రమించేశారు. రోడ్డు ఇరుకైపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

దుగరాజపట్నం ఓడరేవుతో అభివృద్ధి



సూళ్లూరుపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న చింతామోహన్, కాంగ్రెస్ నాయకులు శివ

కోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దుగరాజపట్నంలో ఓడ రేవు ఏర్పాటు అయితే మారు మూలపల్లెలు సైతం అభివృద్ధి చెందుతాయని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ అన్నారు. కోట పట్టణంలో సోమవారం దుగరాజ పట్నం ఓడరేవు కావాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చింతామోహన్ మాట్లాడుతూ దుగరాజపట్నం ఓడరేవు వల్ల కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలలో వేలాది మంది నిరుద్యోగులకు జీవనోపాధి లభిస్తుందన్నారు.

సూళ్లూరుపేట: దుగరాజపట్నం పోర్టు పనులు వెంటనే ప్రారంభించాలని చింతా మోహన్ కోరారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద దుగరాజ పట్నం పోర్టు పనులు ప్రారంభించాలని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దుగరాజ పట్నం పోర్టుపై నిర్లక్ష్యం చేస్తూ ఈ ప్రాంతానికి అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చందనమూడి శివ పాల్గొన్నారు.

రామాపురంలో ఆర్టీసీ బస్సుల స్టాపింగ్

తడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రామాపురం గ్రామంలో ఆర్టీసీ బస్సులు నిలిచేలా చర్యలు తీసుకున్నామని సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లికార్జున తెలిపారు. కొద్దిరోజుల క్రితం రామాపురానికి వచ్చిన కలెక్టర్ వెంకటేశ్వర్‌కు బస్సు వసతి కల్పించాలంటూ గ్రామస్తులు విన్నవించుకున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ అప్పట్లో ఆయన ఆదేశాలు ఇచ్చారు. ఆ ఆదేశాల మేరకు సూళ్లూరుపేట ఆర్టీసీ అధికారులు రామాపురంలో సోమవారం బస్టాప్‌ను ఏర్పాటు చేశారు. చెన్నై సర్వీసులు ఆగుతాయని ఆ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ మల్లికార్జున తెలిపారు. యూనియన్ నాయకులు శేఖర్ ఉన్నారు.

అన్ని సమస్యలూ పరిష్కరిస్తాం: కమిషనర్



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ కాటయ్య, కసారెడ్డిపాలెం వాసులు

సూళ్లూరుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అన్ని అర్జీలను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్య అన్నారు. సోమవారం సూళ్లూరుపేట మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మున్సిపాలిటీ కార్యాలయం చుట్టూ నివాసాలు ఉండే ప్రజలు కార్యాలయం చుట్టూ ఉండే నాలుగు వైపులా రోడ్డులో చిన్నపాటి వర్షమొచ్చినా మురుగునీరు నిలచి దుర్గంధం వెదజల్లుతోందని సమస్య పరిష్కరించాలని కోరారు. అలాగే కసారెడ్డిపాలెం చెరువు ఆక్రమణకు గురవు తోందని మురుగు నీరంతా చెరువులో కలుస్తోందని మాజీ కౌన్సిలర్ పొన్నా కాటయ్యతో కలిసి ఆ ప్రాంతానికి చెందిన ప్రజలు వినతి పత్రం అందజేశారు. మొత్తం వివిధ సమస్యలపై 19 అర్జీలు వచ్చాయని అన్నింటినీ పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు.

పేదల ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి: సీపీఎం



దేగలపాలెం సచివాలయంలో అర్జీ వస్తున్న సీపీఐ నాయకులు

సూళ్లూరుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన గృహాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోదుగుల పార్థసారధి కోరారు. సోమవారం ఆయన సీపీఐ నాయకులతో కలిసి కోళ్లమిట్ట, ఇసుకమిట్ట, మన్నారు పోలూరు, దేగలపాలెం, మన్నారుపోలూరు సచివాలయాలతో పాటు మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఆనంద్ బాబు, సీపీఐ నాయకులు మోదుగుల రమణయ్య, బాలయ్య, లక్ష్మీ, అశోక్‌బాబు, మీరా పాల్గొన్నారు.

పుస్తకం మనిషికి మంచి మిత్రుడు

షార్‌లో ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న షార్ డైరెక్టర్, పక్కనే ఐఐటీ తిరుపతి డిప్యూటీ లైబ్రేరియన్ ప్రశాంత కుమార్, షార్ కంట్రోలర్ శ్రీనివాసుల రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ హమీద్

సూళ్లూరుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పుస్తకం మనిషికి మంచి మిత్రుడితో సమానమని ఐఐటీ తిరుపతి గ్రంథాలయ సహాయకులు ప్రశాంత కుమార్ బెహరా పేర్కొన్నారు. సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో సోమవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వారోత్సవాలను పురస్కరించుకొని షార్‌లోని బ్రహ్మ ప్రకాష్‌లో హాలులో నిర్వహించిన పుస్తక ప్రదర్శనను షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌ఆర్ రంగనాథన్ భారత లైబ్రరీ సైన్సు పితామహుడిగా పరిగణించారని ఆయన రచనలు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రభావం చూపాయన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన. ప్రశాంత కుమార్ బెహరా మాట్లాడుతూ మానవ జీవితంలో గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసుల రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ హమీద్, ఎంఎస్‌ఏ గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక వెలుగులు



సోమేశ్వర ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పలు గ్రామాల్లో గల శివాలయాలలో సోమవారం కార్తీకమాస పూజలు జరిగాయి. గూడలిలోని కామాక్షిదేవి సమేత సంఘమేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్‌స్వామి ఆధ్వర్యంలో స్వామివారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు చేసి రుద్రాభిషేకం నిర్వహించారు. కామాక్షిదేవి సమేత సోమేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అదే విధంగా సోమేశ్వరుడు, కామాక్షిదేవి అమ్మవార్లను ఊరేగించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవార పూజలు

గూడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా మూడవ సోమవారం పట్టణంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. స్థానిక శివాలయం, వీరభద్రస్వామి ఆలయం, సంఘమేశ్వరస్వామి ఆలయాలలో భక్తులు కార్తీకదీపాలను వెలిగించారు. స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

లక్ష దీపోత్సవం

సూళ్లూరుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస మూడో సోమవారం పురస్కరించుకొని సూళ్లూరుపేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో లక్ష దీపోత్సవం కనుల పండువగా జరిగింది. ముందుగా అమ్మవారి చెంత దీపారాధన చేసి ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గణపతి హోమం అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం భక్తులు దీపాలు వెలిగించారు. పార్వతీ పర మేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కాకి శ్రీరామ్మూర్తి అన్నిఏర్పాట్లు చేశారు.



టీడీపీలో చేరుదాం అభివృద్ధిలో భాగమవుదాం



సభ్యత్వం తీసుకుంటున్న యువత

బాలాయపల్లి, నవంబరు 18,(ఆంధ్రజ్యోతి): టీడీపీలో చేరుదాం.. ఏపీ అభివృద్ధిలో భాగమవుదామని కార్యక్రమాన్ని ఐటీడీపీ అధ్యక్షులు గూతు ప్రసన్న కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కడగుంట గ్రామంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రూ.100 సభ్యత్వ రుసుముతో రూ.5లక్షలు ప్రమాద బీమా కల్పించి కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తుందని ఆయన తెలియజేశారు.

టీచర్‌ను నియమించండి

చిల్లకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాంచారమ్మపేటలోని ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడుని నియమించాలని సోమవారం ఎస్‌ఎంసీ సభ్యులు, తల్లి దండ్రులు ఎంఈవో సనత్‌కుమార్, ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాలలో 81మంది విద్యార్థులు ఉన్నార న్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. పాఠశాలకు నలుగురు ఉపాధ్యాయులు ఉండగా ఒకరిని వేరే పాఠశాలకు పంపారన్నారు. ఒకరు మెడికల్ లీవ్‌లో ఉన్నారన్నారు. మిలిగిన ఇద్దరు సిలబస్ పూర్తిచేయలేక, సరైన బోధన అందించలేక పోతున్నారు. విద్యార్థులు చదువులో వెనబడుతున్నారని పేర్కొన్నారు. సమస్య పరిష్కరించాలని కోరారు.

సాదర వీడ్కోలు



తిరుపతి విమానాశ్రయంలో చంద్రబాబుకు వీడ్కోలు పలుకుతున్న టీడీపీ నేత ఇందుశేఖర్